Follow: @ANNTELUGU

22-04-2025

ANN తెలుగు

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 141 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## భూ భారతి సకల సమస్యలకు పరిష్కార వేదిక

ఇబ్రహీంపట్నంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

ప్రభుత్వ భూమిలో పేద ప్రజలకు ఇళ్ల పట్టాలు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** భూభారతి చట్టం రైతులకు చుట్టంలా సకల సమస్యలకు పరిష్కార వేదికగా ఉంటుందని గౌరవ రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం ఇబ్రహీంపట్నం మండలం కేంద్రంలోని శాస్త్ర గార్డెన్ నందు ఏర్పాటు చేసిన భూ భారతి చట్టం2025 పై అవగాహన సదస్సు కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఇబ్రహీంపట్నం శాసన సభ్యులు మల్ రెడ్డి రంగా రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డిలతో కలిసి పాల్గొన్నారు. భూభారతి చట్టంపై, అందులోని అంశాలపై వివరిస్తూ రైతులకు అవగాహన కల్పించారు.

మిగతా 3లో

టాప్ న్యూస్

## అల్లు అర్జున్‌పై మరో కేసు?

- ఈసారి శ్రీలీల కూడా
- తప్పుడు ప్రచారాలు.. ర్యాంకుల మోసాలు



02

## తులం బంగారం లక్ష


- ఆల్ టైం రికార్డు
- బంగారం ధరలకు రెక్కలు



02

## హైదరాబాద్ ప్రశాంతంగా ఉండాలంటే బీజేపీని గెలిపించండి

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



02



## లంచావతారాలు

ఏసీబీ వలలో ఒకే రోజు ఐదుగురు

అందులో ఓ టీవీ రిపోర్టర్!

వివరాలు 2లో



# నవ ప్రపంచాన్ని నిర్మిద్దాం



### తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

జపాన్ వ్యాపారవేత్తలను ఆహ్వానించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ఒసాకా ఎక్స్ పోలో ప్రత్యేక ఆకర్షణగా తెలంగాణ పెవిలియన్

**మహా:** తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి జపాన్ వేదికగా ప్రపంచానికి చాటి చెప్పారు. ఒసాకాలో జరిగిన వరల్డ్ ఎక్స్ పోలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం పాలుపంచుకుంది. వివిధ రంగాలకు చెందిన వ్యాపార వేత్తలు, పారిశ్రామికవేత్తలతో విడివిడిగా సమావేశమైంది. వివిధ రంగాల్లో రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను వారితో చర్చించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ఒసాకాలో జరుగుతున్న వరల్డ్ ఎక్స్ పోలో దేశంలోనే మొదటి రాష్ట్రంగా తెలంగాణ పాలుపంచుకోవటం గర్వంగా ఉందని అన్నారు. తెలంగాణ, జపాన్‌ల మధ్య ఉన్న చారిత్రక స్నేహాన్ని దీర్ఘకాల భాగస్వామ్యంగా మార్చుకుందామని పిలుపునిచ్చారు. కొత్త ఆవిష్కరణలతో భవిష్యత్ ప్రణాళికల రూపకల్పనకు కలిసి పనిచేద్దామనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న స్థిరమైన విధానాలు,సులభతర పారిశ్రామిక విధానం, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు తెలంగాణలో ఉన్నాయన్నారు.

మిగతా 2లో

## ఉపాధి హామీకి రూ.2708.3 కోట్లు మంజూరు

ఈ ఏడాది 6.5 కోట్ల పని దినాలు లక్ష్యం

పనులను ఆమోదించిన మంత్రి సీతక్క

గ్రామీణ ఉపాధికి ఊతం.. వ్యవసాయ ప్రగతికి సాయం




వరంగల్ జిల్లాలో జరిగిన తెలంగాణ ఆదివాసీ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

**హైదరాబాద్, మహా:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఈ ఏడాది 6.5 కోట్ల పనిదినాలు లక్ష్యంగా రూ.2708.3 కోట్లు మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన ఉపాధి హామీలో కొత్త ప్రణాళికలకు గ్రామీణాభివృద్ధి,పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ఆమోదం తెలిపింది. జిల్లాల వారీగా పనుల కార్యాచరణ సిద్ధం చేశారు. వేతనాలకు రూ.1625 కోట్లు, మెటీరియల్‌కు రూ.1083 కోట్లు ఖర్చుచేయాలని నిర్ణయించారు. మహిళా శక్తి ఉపాధి భరోసా,పొలం బాటలు, ఫల వనాలు, వన మహోత్సవం, జలనిధి, గ్రామీణ పారిశుద్ధ్యం వంటి పనులు త్వరలో ప్రారంభించాలని నిర్ణయించారు.




### యువతకు ఉపాధి కల్పన కోసం మూడంచెల వ్యూహం అమలు

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
- 100కు పైగా కంపెనీలలో 5 వేల ఉద్యోగ అవకాశాలు కల్పించేలా మెగా జాబ్ మేళా నిర్వహణ
- త్వరలో 30 వేల ప్రభుత్వ ఉద్యోగాల కల్పనకు కసరత్తు
- 9 వేల కోట్ల రూపాయలతో రాజీవ్ యువ వికాసం క్రింద స్వయం ఉపాధి ప్రోత్సాహం
- యువత మత్తు పదార్థాలు, సంఘ విద్రోహ శక్తులకు దూరంగా ఉండాలి
- మధిర పట్టణం రెడ్డి గార్డెన్స్ లో నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం

02

### మాజీ డీజీపీ కాళ్లు చేతులు కట్టేసి కారం చల్లారు

- ఆపై నూనె పోసి..కూతురుతో కలిసి భార్య కిరాతకం..
- ఒళ్లు గగుర్పొడిచే వాస్తవాలు
- ఒక హత్య.. 100 ప్రశ్నలు..!

వివరాలు 7లో

### భర్తను కరెంట్ షాక్‌తో చంపి పూడ్చిపెట్టిన భార్య..!

- భార్యాభర్తలిద్దరికీ వివాహేతర సంబంధాలు
- హైదరాబాద్‌లోని కేపీహెచ్ బీలో దారుణం

02

### హైకోర్టులో కేటీఆర్‌కు ఊరట

- రూ.25 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారంటూ కేటీఆర్ ఆరోపణ
- కేసు కొట్టి వేసిన న్యాయస్థానం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై నిరాధారమైన ఆరోపణలు చేశారంటూ కేసు నమోదు
- ఆత్రం సుగుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఉట్నూరు పోలీసులు

వివరాలు 2లో

### ఎన్నికల సంఘం రాజీపడింది

- లోపాలున్నాయని మాకు స్పష్టంగా తెలుసు
- కేంద్ర ఎన్నికల వ్యవస్థపై రాహుల్ సంచలన ఆరోపణలు



వివరాలు 7లో




### మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని షాక్

- జర్మన్ పౌరుడేనని తేల్చి చెప్పిన హైకోర్టు
- రమేశ్‌కు రూ. 30 లక్షలు జరిమానా విధించిన కోర్టు
- రమేశ్ పౌరసత్వంపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిటిషన్ దాఖలు

02



### కాంగ్రెస్ మంత్రులతో పాయల్ శంకర్ దోస్తీ

తను కాంగ్రెస్ ఎమ్మెల్యేనే అనుకోండని వారితో వెల్లడి

- తన భూకబ్జాలు బయట పడకుండా జాగ్రత్త
- ఇలాంటి భూ మాఫియాదారున్ని కాంగ్రెస్ పార్టీ క్షమించదు
- ఇప్పటికే మంత్రులకు చేరిన పాయల్ కబ్జాల చిట్టా
- విచారణ జరిపిస్తే పాయల్ రాజకీయ భవిష్యత్తు గందరగోళం
- భూభారతి సదస్సు సక్సెస్ పట్ల హర్షం
- విచ్చేసిన మంత్రులు, అధికారులు, రైతులు, ప్రజలకు, నాయకులకు అభిమానులకు ప్రత్యేక ధన్యవాదాలు: ప్రెస్ మీట్ లో కంది శ్రీనివాస రెడ్డి



05

# తులం బంగారం లక్ష

## ఆల్ టైం రికార్డు.. బంగారం ధరలకు రెక్కలు



**మహా:** బంగారం ధరలు చుక్కలంటుతున్నాయి. పది గ్రాముల పసిడి ధర రికార్డు స్థాయిలో లక్ష రూపాయలను తాకింది. హైదరాబాద్ మార్కెట్‌లో పది గ్రాముల 24 క్యారెట్ల పసిడి ధర ఒక దశలో లక్షా పది రూపాయలకు చేరింది. తర్వాత స్వల్పంగా తగ్గింది. దేశ రాజధాని దిల్లీ మార్కెట్‌లో పది గ్రాముల బంగారం ధర ఇవాళ రూ.16,050 మేర పెరిగి రూ.99,800లకు చేరింది. ఈ ఏడాదిలో ఇప్పటికే పది గ్రాముల పసిడి ధర రూ.20,850 మేర పెరిగింది. అమెరికాచైనా వాణిజ్య యుద్ధ భయాలు సహా అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్ విలువ క్రమంగా తగ్గుతుండడం వంటి పరిణామాలు బంగారం ధరలు పెరగడానికి కారణమని నిపుణులు చెబుతున్నారు. అటు వెండి ధరలు కూడా మండిపోతున్నాయి. కేజీ వెండి ధర ఇవాళ రూ.500 మేర పెరిగి రూ.98,500కు చేరింది.

# ఏడుగురు హైకోర్టు న్యాయమూర్తుల బదలీ

## జాబితాలో ఇరు తెలుగు రాష్ట్రాల న్యాయమూర్తులు కూడా కొలీజియం సిఫార్సు



**మహా :** ఏడుగురు హైకోర్టు న్యాయమూర్తులను బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయం తీసుకుంది. ఇందులో కర్ణాటక హైకోర్టుకు చెందిన నలుగురు న్యాయమూర్తులు ఉన్నారు. తెలంగాణకు చెందిన ఇద్దరు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒకరు ఉన్నారు. ఈ మేరకు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని కొలీజియం ఆమోదించింది. ఏప్రిల్ 15 నుంచి 19 వరకు జరిగిన కొలీజియం సమావేశాల్లో ఈ నిర్ణయం తీసుకుంది. జస్టిస్ హేమంత్ చందన్ గౌడర్ కర్ణాటక హైకోర్టు నుంచి మద్రాస్ హైకోర్టుకు బదిలీ కోరగా కొలీజియం ఆమోదం తెలిపింది. మరో న్యాయమూర్తి జస్టిస్ కృష్ణన్ నటరాజన్ కేరళ హైకోర్టుకు కోరగా ఓకే చెప్పింది. జస్టిస్ నెరనహళ్లి శ్రీనివాస్ సంజయ్ గౌడను గుజరాత్ హైకోర్టుకు, జస్టిస్ దీక్షిత్ కృష్ణ శ్రీపాద్‌ను ఒడిశా హైకోర్టుకు బదిలీ చేసింది. వీరితో పాటు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పెరుగు శ్రీ సుధను కర్ణాటకకు, జస్టిస్ కాసోజు సురేందర్‌ను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేసింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కుంభజడల మన్మధరావును కర్ణాటక హైకోర్టుకు బదిలీ చేస్తూ కొలీజియం నిర్ణయం తీసుకుంది.

# యువతకు ఉపాధి కల్పన కోసం మూడంచెల వ్యూహం అమలు


## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

- 100కు పైగా కంపెనీలలో 5 వేల ఉద్యోగ అవకాశాలు కల్పించేలా మెగా జాబ్ మేళా నిర్వహణ
- త్వరలో 30 వేల ప్రభుత్వ ఉద్యోగాల కల్పనకు కసరత్తు
- 9 వేల కోట్ల రూపాయలతో రాజీవ్ యువ వికాసం క్రింద స్వయం ఉపాధి ప్రోత్సాహం
- యువత మత్తు పదార్థాలు, సంఘ విద్రోహ శక్తులకు దూరంగా ఉండాలి
- మధిర పట్టణం రెడ్డి గార్డెన్స్ లో నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం



**ఖమ్మం, మహా:** కోరి తెచ్చుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పన కోసం ప్రజా ప్రభుత్వం మూడంచెల వ్యూహం అమలు చేస్తుందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. 5 వేల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో మధిర పట్టణంలోని రెడ్డి గార్డెన్స్ లో సోమవారం ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ ఉద్యోగ మేళాలో 100కు పైగా కంపెనీలు పాల్గొని, 5 వేల మందికి ఉద్యోగాలు ఇవ్వడానికి కంపెనీ ప్రతినిధులు ముందుకు వచ్చారని, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యువత అనేక ఆశలతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో పాల్గొనడం జరిగిందని, కోరి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో గత పది సంవత్సరాలుగా పాలకులు యువతను నిర్లక్ష్యం చేశారని, యువతకు ఉపాధి అవకాశాలు చూపించడంలో వైఫల్యం చెందారని అన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం మూడంచెల వ్యూహం అమలు చేస్తుందని అన్నారు. ఇందులో భాగంగా మొదట పబ్లిక్ సర్వీస్ కమీషన్ ప్రక్షాళన చేసి జాబ్ కేలండర్ విడుదల చేసామని, మొదటి దశలో ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డ మొదటి సంవత్సరంలోనే ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న 56 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, త్వరలోనే మరో 30 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి కసరత్తు జరుగుతుందని అన్నారు. రెండవ దశలో ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న గ్లోబలైజేషన్ లో భాగంగా వస్తున్న మార్పులను అలవర్చుకొని బహుళ జాతుల సంస్థలకు రాష్ట్రంలో అవసరమైన వనరులు కల్పించి భారీ ఎత్తున పెట్టుబడులు, వీటి ద్వారా యువతకు లక్షల్లో ఉద్యోగ అవకాశాలు సాధిస్తున్నామని అన్నారు. మూడవ దశలో ఉపాధిని ప్రోత్సహించేందుకు 9 వేల కోట్ల పెట్టుబడితో రాజీవ్ యువ వికాసం పథకం క్రింద యువతకు రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2 నాడు స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు మంజూరు పత్రాలు పంపిణీ చేయనున్నామని, స్వయం ఉపాధి కోసం ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా భారీగా నిధులు కేటాయించామని అన్నారు. చదువు పూర్తి చేసుకున్న వారు ఖాళీగా ఉండకుండా, సొంత ఆదాయంతో ముందడుగు వేసేందుకు జాబ్ మేళాలు ఉపయోగపడతాయని, ఇక్కడ ఉద్యోగం పొందిన వారు ఇక్కడితోనే ఆగిపోకుండా ఇది మొదటి మెట్టుగా భావించి వచ్చిన జీతంతో వారి జీవితంలో పెట్టుకున్న గొప్ప లక్ష్యాలను సాధించాలని సూచించారు. నేడు మధిర పట్టణంలో నిర్వహించే జాబ్ మేళా ద్వారా ఒకే రోజు 5 వేల మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. యువత రాష్ట్రానికి గొప్ప వనరు అని, రాష్ట్ర జిడిపి పెరుగుదలకు, కుటుంబ బాగు కోసం, సమాజానికి పెద్ద ఎత్తున యువత ఉపయోగపడాలని ఆయన ఆకాంక్షించారు. ఖాళీగా ఉండే యువత సంఘ విద్రోహ శక్తులకు, మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉండాలని, చివరి వయసులో తల్లిదండ్రులను బాధపడకుండా చూసుకోవాలని, యువత సన్మార్గంలో నడిచేందుకు జాబ్ మేళాలు ఉపయోగపడతాయని అన్నారు. రాష్ట్రంలోని యువతకు అవసరమైన స్కిల్ అందించేందుకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 65 ఐటిఐ కళాశాలలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ గా అప్ గ్రేడ్ చేసిందని అన్నారు. నిరుపేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందించాలనే ఆలోచనతో 60 యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్ నిర్మాణానికి ఒకేసారి 11 వేల 600 కోట్ల నిధులను కేటాయించిందని, ఈ పాఠశాలల ద్వారా నాలుగో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు నాణ్యమైన విద్య ఉచితంగా అందుబాటులోకి వస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను అప్ గ్రేడ్ చేసి అన్ని వసతులు కల్పిస్తున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇంచార్జీ కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ జీవితంలో విజయం సాధించేందుకు మనపై నమ్మకం ఉండడం చాలా ముఖ్యమని, చిన్న ఉద్యోగమైన మనం చేరితే మనలో విశ్వాసం పెరుగుతుందని, ఉన్నత స్థాయికి చేరుకోవడానికి ఇది తోడ్పాటు అందిస్తుందని అన్నారు. యువతకు వచ్చిన అవకాశాలను సంపూర్ణంగా వినియోగించుకోవాలని, జాబ్ మేళాలో వచ్చిన ఉద్యోగాల్లో ఎటువంటి సమస్య వచ్చినా అవసరమైన సహకారం జిల్లా యంత్రాంగం నుంచి అందిస్తామని అన్నారు. మేగా జాబ్ మేళా నిర్వహణలో సహకరించిన డిప్యూటీ సీఎంకు ఇంచార్జి కలెక్టర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మెగా ఉద్యోగ మేళాలో సింగరేణి జనరల్ మేనేజర్ సాలీం రాజు, వివిధ కంపెనీల ప్రతినిధులు, యువత, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నవ ప్రపంచాన్ని నిర్మిద్దాం



(మొదటిపేజీ తరువాయి)

'హైదరాబాద్‌కు రండి.. మీ ఉత్పత్తులు తయారు చేయండి.. భారత మార్కెట్‌తో పాటు ప్రపంచంలోని వివిధ దేశాలకు ఎగుమతి చేసేందుకు తెలంగాణను గమ్యస్థానంగా ఎంచుకొండి..' అని జపాన్ కంపెనీలను సీఎం తెలంగాణకు ఆహ్వానించారు. తెలంగాణకు జపాన్ మధ్య చక్కటి సంబంధాలున్నాయని, ఒసాకా బేలో సూర్యోదయం లాంటి కొత్త అధ్యాయం తెలంగాణలో ప్రారంభమవుతోందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. తెలంగాణతో పాటు ఒసాకా, ప్రపంచంతో కలిసికట్టుగా అద్భుతమైన భవిష్యత్తును నిర్మిద్దామని పిలుపునిచ్చారు. ఐటీ, బయో టెక్నాలజీ రంగాల్లో తెలంగాణ ఇప్పటికే ప్రత్యేకమైన గుర్తింపు సాధించిందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. వీటితో పాటు ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్ రంగాల పరిశ్రమలకు ఉన్న అనుకూలతలను వివరించారు. హైదరాబాద్ లో 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ'ని నిర్మిస్తున్నామని, ఎకో, ఎనర్జీ, స్మార్ట్ మొబిలిటీ, సర్క్యులర్ ఎకానమీపై ఈ సిటీ ఆధారపడుతుందన్నారు. జపాన్‌కు చెందిన మారుబెని కార్పొరేషన్‌తో ఫ్యూచర్ సిటీలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ చుట్టూ 370 కిలోమీటర్ల రీజనల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్), రేడియల్ రోడ్లతో పాటు ఆర్ఆర్ఆర్కు ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) మధ్య ఉన్న జోన్‌లో ఎలక్ట్రిక్ వాహనాలు, ఎనర్జీ స్టోరేజ్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్స్, ఏరోస్పేస్ పరిశ్రమలకు అనువైన వాతావరణం ఉందన్నారు. ఎగుమతులకు వీలుగా సమీప ఓడరేవుతో అనుసంధానించే డ్రై పోర్ట్ ను తెలంగాణలో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. మూసీ పునరుజ్జీవనంలో భాగంగా నది పొడవునా 55 కిలోమీటర్ల అర్బన్ గ్రీన్ వే అభివృద్ధి చేసేందుకు టోక్యో, ఒసాకా నగరాలను చూసి ఎంతో నేర్చుకోవాల్సి ఉందని అన్నారు. నైపుణ్యాల శిక్షణతో పాటు నాణ్యత, క్రమశిక్షణకు అద్దం పట్టేలా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ ఏర్పాటు చేశామని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. ఈ యూనివర్సిటీ రాష్ట్రంలో ఉపాధి, వ్యాపార అవకాశాలను రెట్టింపు చేస్తుందన్నారు.



# మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని షాక్

- జర్మన్ పౌరుడేనని తేల్చి చెప్పిన హైకోర్టు
- రమేశ్‌కు రూ. 30 లక్షలు జరిమానా విధించిన కోర్టు
- రమేశ్ పౌరసత్వంపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిటిషన్ దాఖలు

**మహా :** బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌కు హైకోర్టులో బిగ్ షాక్ తగిలింది. ఆయన భారత పౌరుడు కాదని, జర్మన్ పౌరుడని తెలంగాణ హైకోర్టు తేల్చి చెప్పింది. ఆయన పౌరసత్వంపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిటిషన్ దాఖలు చేయగా తాజాగా విచారణ జరిపిన న్యాయస్థానం ఈ మేరకు సంచలన తీర్పును వెల్లడించింది. ఈ సందర్భంగా తప్పుడు పత్రాలతో 15 ఏళ్ల పాటు ప్రభుత్వ అధికారులు, న్యాయస్థానాలను చెన్నమనేని రమేశ్ తప్పుదోవ పట్టించారని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆయన పౌరసత్వాన్ని రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని న్యాయస్థానం సమర్థించింది. అలాగే ఆయనను రూ. 30లక్షల జరిమానా చెల్లించాలని ఆదేశించింది. ఇందులో పిటిషనర్ ఆది శ్రీనివాస్‌కు రూ. 25లక్షలు, హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీకి రూ. 5లక్షలు చెల్లించాలని తెలిపింది. న్యాయస్థానం తీర్పుపై అప్పీల్ చేయకుండా తన తప్పును ఒప్పుకుని చెన్నమనేని రమేశ్ రూ. 30 లక్షల ఫైన్ చెల్లించారు.

# భర్తను కరెంట్ షాక్‌తో చంపి పూడ్చిపెట్టిన భార్య..!

## భార్యాభర్తలిద్దరికీ వివాహేతర సంబంధాలు
## హైదరాబాద్‌లోని కేపీహెచ్ బీలో దారుణం



**మహా :** పచ్చని కాపురాల్లో అక్రమ సంబంధాలు చిచ్చు పెడుతున్నాయి. అనేక కుటుంబాలల్లో గొడవలకు, విడాకులకు, ఘోరమైన నేరాలకు దారితీస్తున్నాయి. కొందరు వ్యక్తులు క్షణికమైన ఆనందం కోసం పక్కదారులు పడుతుండగా వాటి వల్ల దీర్ఘకాలంలో విషాదాలకు కారణమవుతున్నారు. భార్యాభర్తల మధ్య సరైన అవగాహన లేకపోవటం, వ్యక్తిగత అసంతృప్తి, ఆర్థిక సమస్యలు వంటి అనేక కారణాల వల్ల వివాహేతర సంబంధాల వైపు ఆకర్షితులవుతున్నారు. ఈ చర్యలు కొన్నిసార్లు ఆత్మహత్యలకు, హత్యలకు దారి తీస్తున్నాయి.

తాజాగా.. హైదరాబాద్ కేపీహెచ్‌బీ కాలనీలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. భర్తను కరెంట్ షాక్‌తో హత్య చేసిన ఓ మహిళ అనంతరం మృతదేహాన్ని పూడ్చిపెట్టి ఏమీ తెలియనట్లుగా సొంత ఊరుకు వెళ్లిపోయింది. బంధువులకు అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయిలు, కవిత దంపతులు కేపీహెచ్‌బీ కాలనీలో నివాసముంటున్నారు. స్థానికంగా ఓ నిర్మాణంలో ఉన్న ఓ బిల్డింగ్‌కు వాచ్‌మెన్‌గా పనికి కుదిరారు. అయితే గత 15 ఏళ్లుగా భార్య, భర్తలు అనారోగ్యంతో బాధపడుతున్నారు. కొంతకాలంగా వీరిద్దరూ వేర్వేరుగా జీవనం కొనసాగిస్తున్నారు. వారిద్దరికీ వివాహేతర సంబంధాలు ఉన్నట్లు తెలిసింది. కాగా, రెండ్రోజుల క్రితం కవిత తన సొంతూరు వెళ్లి భర్త సాయిలు పనికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదని చెప్పింది. దీంతో గ్రామంలోని బంధువులు, సన్నిహితులు సాయిలు కోసం వెతికారు. అతడి ఆచూకీ లభించకపోవడంతో అనుమానం వచ్చిన బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న కేపీహెచ్‌బీ పోలీసులు విచారణ ప్రారంభించగా.. భార్య కవితే అతడిని హత్య చేసినట్లు తెలిసింది. భర్త సాయిలు వేధింపులను భరించలేక ఈ నెల 18న కవిత అతడికి విద్యుత్ షాక్ ఇచ్చి హత్య చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. అనంతరం మృతదేహాన్ని పూడ్చిపెట్టిందని పోలీసులు తెలిపారు. ఈ దారుణానికి కవిత తన చెల్లెలి భర్త సహాయాన్ని కూడా తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం నిందితురాలిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు. విచారణ తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.



# హైదరాబాద్ ప్రశాంతంగా ఉండాలంటే బీజేపీని గెలిపించండి


## మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

**మహా :** హైదరాబాద్ లో శాంతి భద్రతలు నెలకొని ఉండాలంటే బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఈటల, నరేంద్ర మోదీ ప్రధానమంత్రి కాకముందు హైదరాబాద్‌తో సహా దేశంలోని పలు ప్రాంతాల్లో ఉగ్రవాదులు బాంబు దాడులకు పాల్పడ్డారని.. కానీ మోదీ పాలనలో దేశంవైపు కన్నెత్తి చూసేందుకు కూడా ఉగ్రవాదులు భయపడుతున్నారన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో నగరాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, భారతదేశం ఇతర దేశాలతో బలమైన సంబంధాలను కొనసాగిస్తోందని ఈటల పేర్కొన్నారు. స్మార్ట్ సిటీలు, అమృత్ నగరాల పేరిట దేశంలోని అన్ని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు అందిస్తోందన్నారు. హైదరాబాద్‌లో ఫ్లైఓవర్లు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి కేంద్రం నిధులు సమకూరుస్తోందని, చర్లపల్లి, సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి రైల్వే స్టేషన్ల అభివృద్ధి కూడా కేంద్ర సహకారంతోనే వేగంగా జరుగుతోందని ఈటల వివరించారు. కొంపల్లి, అంబర్‌పేట్, ఎల్బీనగర్ ఫ్లైఓవర్ల నిర్మాణానికి కేంద్రం వేల కోట్ల రూపాయలు ఇస్తోందని ఈటల పేర్కొన్నారు. హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీకి ఓటు వేస్తే అది మన చేత్తో మన కంట్లో పొడుచుకున్నట్లేనని ఈటల వ్యాఖ్యానించారు. ఓటు వేసే ముందు ఓటర్లు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలని ఆయన సూచించారు. ఎంఐఎం పార్టీకి ఓటు వేయడం వల్ల హైదరాబాద్‌లో శాంతి భద్రతలు క్షీణిస్తాయని, అభివృద్ధి కుంటుపడుతుందని ఈటల ఆరోపించారు.

# అల్లు అర్జున్‌పై మరో కేసు?

## ఈసారి శ్రీలీల కూడా...

### తప్పుడు ప్రచారాలు.. ర్యాంకుల మోసాలు




**మహా:** జేఈఈ మెయిన్స్ ర్యాంకులపై ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. టాప్ ర్యాంకులు మా కాలేజీలో వచ్చాయని తప్పుడు ప్రచారాలు చేస్తూ.. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులను కూడా మోసం చేస్తున్నాయి. ఈ తీరుపై విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. వీటికి సంబంధించిన ఆధారాలను ఏఐఎస్ఎఫ్ పేర్కొంటూ , కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలపైన, ప్రచారకర్తలుగా వ్యవహరిస్తున్న అల్లు అర్జున్, శ్రీలీలపై చట్టపర చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాలపై వార్తాపత్రికల్లో టాప్ ప్రైవేట్ కాలేజీలు యాడ్స్ రిలీజ్ చేశారు. ఒక కాలేజీలో ఉన్న విద్యార్థిని వేరొక కాలేజ్ కూడా యాడ్ ఇచ్చింది. వేర్వేరు కాలేజీలు.. వేర్వేరు యాడ్‌లు.. వేర్వేరు ర్యాంకులు.. కానీ విద్యార్థి మాత్రం ఒక్కరే. టాప్ ర్యాంకర్ స్టూడెంట్లను కూడా ప్రైవేట్ యాజమాన్యాలు కొనుగోలు చేస్తున్నాయి. ఒక విద్యార్థి ఒకేసారి ఇన్ని కాలేజీలలో ఎలా చదువుతాడని ప్రశ్నిస్తున్నారు.

# హైకోర్టులో కేటీఆర్‌కు ఊరట

## రూ.25 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారంటూ కేటీఆర్ ఆరోపణ


- కేసు కొట్టి వేసిన న్యాయస్థానం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై నిరాధారమైన ఆరోపణలు చేశారంటూ కేసు నమోదు
- ఆత్రం సుగుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఉట్నూరు పోలీసులు



**మహా :** తెలంగాణ హైకోర్టులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఊరట లభించింది. ఖానాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం ఉట్నూరు పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. కాంగ్రెస్ మహిళా నాయకురాలు ఆత్రం సుగుణ ఫిర్యాదు మేరకు 2024 సెప్టెంబర్‌లో ఉట్నూరు పోలీస్ స్టేషన్‌లో ఆయనపై కేసు నమోదైంది. మూసీ ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.25 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడుతోందని ఉట్నూరులో జరిగిన ఒక సభలో కేటీఆర్ ఆరోపణలు చేశారు. దేశంలో రాబోయే ఎన్నికల నిధుల కోసం మూసీ ప్రాజెక్టును రిజర్వ్ బ్యాంక్‌లా ఉపయోగించుకోవాలని చూస్తోందని ఆరోపించారు. కేటీఆర్ చేసిన ఆరోపణలపై ఆత్రం సుగుణ ఫిర్యాదు చేశారు. తమ పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగేలా కేటీఆర్ వ్యాఖ్యలు చేశారంటూ ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థాయిని తగ్గించేలా నిరాధారమైన ఆరోపణలు చేసిన కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కేసును హైకోర్టు తాజాగా కొట్టివేసింది.

# లంచావతారాలు

## ఏసీబీ వలలో ఒకే రోజు ఐదుగురు.. అందులో ఓ టీవీ రిపోర్టర్!



**మహా :** తెలంగాణలో ఏసీబీ దాడులు సంచలనంగా మారాయి. అధికారులు వేర్వేరు జిల్లాల్లో నిర్వహించిన దాడుల్లో ఇద్దరు అధికారులను, ఓ టీవీ రిపోర్టర్ ను లంచం సొమ్ముతో పట్టుకున్నారు. మణుగూరు పోలీస్ స్టేషన్ సీఐ ఎస్.సతీష్ కుమార్, బిగ్ టీవీ రిపోర్టర్ ఎం.గోపితో కలిసి ఓ కేసులో ఫిర్యాదు దారుడితో పాటు అతని బంధువుల పేర్లు చేర్చకుండా ఉండేందుకు రూ.4లక్షలు డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో బాధితుడు రూ.1లక్ష రూపాయలను వారికి అందచేస్తుండగా పథకం ప్రకారం ఏసీబీ అధికారులు దాడి చేసి లంచం సొమ్ముతో సహా పట్టుకున్నారు. మరో కేసులో ఎఫ్ టీఎఫ్ నిధుల మంజూరుకు సంబంధించి ఆర్మూర్ పంచాయతీ రాజ్ శాఖ సీనియర్ అసిస్టెంట్ ఎన్.శ్రీనివాస శర్మ ఫిర్యాదుదారుడిని రూ.7,500లంచం డిమాండ్ చేశాడు. బాధితుడి నుంచి రూ.7వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ దాడి చేసి శ్రీనివాస శర్మను లంచం సొమ్ముతో సహా పట్టుకుంది. అదే విధంగా మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా నాగారం మునిసిపల్ ఆఫీసులో డిఈఈ సుదర్శనం రఘు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు రాకేష్, సురేష్‌లు సిసి రోడ్ వర్క్ పెండింగ్ రూ.11లక్షల బిల్లులు క్లియర్ చేయడానికి గాను 1.30లక్షలు లంచం డిమాండ్ చేసి, రూ. లక్ష లంచం తీసుకుంటూ తెలంగాణ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. జనగామ జిల్లాలోని చిల్పూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏసీబీ దాడులు చేయగా ఆర్ ఐ వినయ్ కుమార్ లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. భూ సర్వే కోసం డబ్బులు డిమాండ్ చేయగా బాధితులు సోమవారం రూ.26 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. అనంతరం ఆర్ ఐని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించనున్నట్లు అధికారులు తెలిపారు.

## భూ భారతి సకల సమస్యలకు
# పరిష్కార వేదిక

### ఇబ్రహీంపట్నంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
### ప్రభుత్వ భూమిలో పేద ప్రజలకు ఇళ్ల పట్టాలు



(మొదటిపేజీ తరువాయి)

అనంతరం పలువురి అనుమానాలు, సందేహాలు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి' నూతన ఆర్.ఓ.ఆర్ చట్టం 2025 భూ వివాదాల పరిష్కారానికి ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. రైతుల పక్షపాతిగా, వారి సమస్యలు పరిష్కరించేందుకు భూభారతి చట్టం అమలు చేస్తున్నామని అన్నారు. గతంలో రైతులు ధరణి పోర్టల్ ద్వారా చాలా ఇబ్బందులు అనుభవించారని, కార్యాలయాల చుట్టు కాళ్లు అరిగేలా తిరిగారని, అధికారులు కూడా నిస్సహాయులుగా ఉండి పోయారని అన్నారు. ఈ దుస్థితిని మారుస్తూ, పేద రైతుల కన్నీళ్లను తుడిచే ఉద్దేశంతో ఈ నెల 14న డాక్టర్.బి.ఆర్ అంబేద్కర్ జయంతి నాడు భూభారతి చట్టాన్ని ప్రారంభించామన్నారు. గతంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ రైతులకు న్యాయం చేస్తున్నామని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న సాదా బైనామా పరిష్కారం కోసం భూ భారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ప్రభుత్వం అన్ని కోణాలలో, మేధోమథనం చేసిన మీదట సమగ్ర అంశాలను పొందుపరుస్తూ భూభారతి చట్టానికి రూపకల్పన చేయడం జరిగిందన్నారు. ప్రతివారం కలెక్టర్, తహసీల్దార్ సహా సంబంధిత అధికారులతో సమీక్షలు జరిపి భూ సమస్యల పరిష్కారంపై పర్యవేక్షణ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని అన్నారు. ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యాక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వం రైతుల, పేదల, మహిళల, యువత కోసమే కట్టుబడి పని చేస్తోందని, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు.

**ధరణి స్థానంలో కొత్తగా భూ భారతి వ్యవస్థ**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... రైతుల భూమి వివాదాలను పరిష్కరించి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. ధరణి స్థానంలో కొత్తగా భూ భారతి వ్యవస్థను అమలు చేస్తున్నట్లు తెలిపారు. భూ భారతి చట్టంలో 23 సెక్షన్లు మరియు 18 నిబంధనలు ఉన్నాయని తెలిపారు. ఆధార్ తరహాలో భవిష్యత్తులో భూములకు సంబంధించి సర్వే చేసి, హద్దులు, కొలతలు, భూముల వివరాలు ఒకే పుస్తకంలో ఉండేలా 'భూధార్'ను రూపొందించనున్నట్లు తెలిపారు. సాదా బైనామాల పరిష్కారం వేగవంతం అవడంతో పాటు, వారసత్వ మ్యూటేషన్, హక్కుల సంక్రమణను గడువులో పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరం ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి వచ్చేదని అన్నారు.భూ సమస్యలు పరిష్కరిస్తూ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే భూ భారతి చట్టం ప్రకారం అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉందని అన్నారు.తహసీల్దార్ స్థాయిలో దరఖాస్తు చేసుకుంటే న్యాయం జరగలేదని భావిస్తే ఆర్డీవోకు, అక్కడ కూడా సంతృప్తి చెందకపోతే కలెక్టర్ కు అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ చట్టం ద్వారా భూముల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించబడినదని, భూమి రిజిస్ట్రేషన్,మ్యూటేషన్‌కు ముందు తప్పనిసరిగా భూమి సర్వే జరిపించి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. భూభారతి ద్వారా భూమికి సంబంధించిన సమస్యలు జిల్లా స్థాయిలోనే సత్వరం పరిష్కారం అవుతాయని అన్నారు.భూ సమస్యల పరిష్కారానికి ఎంతో వెసులుబాటు కల్పించే భూభారతి చట్టంపై అవగాహనను ఏర్పర్చుకోవాలని, దీనిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. భూభారతి చట్టం వల్ల రైతులకు, పేదలకు ఎంతో మేలు కలుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.



## పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూత!

**అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్‌కు ఆశీస్సులు అందించిన మరుసటి రోజే**

**మహా:** పోప్ ఫ్రాన్సిస్ (88) అనారోగ్య కారణాలతో కన్నుమూశారు. సోమవారం ఆయన వాటికన్ సిటీలో తుది శ్వాస విడిచారు. పోప్ ఫ్రాన్సిస్ గత కొంతకాలంగా శ్వాసకోశ సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. కొద్దిరోజుల క్రితమే పోప్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. నిన్న ఈస్టర్ వేడుకల్లో పోప్ ఫ్రాన్సిస్ తన ఆఖరి సందేశం ఇచ్చారు. స్వేచ్ఛ, సహనాలపై పిలుపునిచ్చారు. "మత స్వేచ్ఛ, ఆలోచనా స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛ, ఇతరుల అభిప్రాయాలను గౌరవించకుండా శాంతి ఉండదు," అని ఆయన తన ప్రసంగం ద్వారా పేర్కొన్నారు. ఆందోళనకరమైన యూదు వ్యతిరేకతను, గాజాలో విచారకరమైన పరిస్థితిని ఆయన తన ప్రసంగం ద్వారా ఖండించారు. కాగా అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ భారత పర్యటనకు ముందు పోప్ ఫ్రాన్సిస్ ఆశీస్సులు తీసుకున్నారు. ఆయన ఆశీస్సులు తీసుకున్న మరునాడే పోప్ మరణించడం ఇప్పుడు సోషల్ మీడియాలో మీమ్స్ బాగా వైరల్ అవుతున్నాయి.

## సొంతూరి సేవలో..
## సీఎం ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డి



**కేసముద్రం, మహా:** రాష్ట్ర ముఖ్యమంత్రికి సంబంధించిన ప్రజాసంబంధాలు, పాలనా వ్యవహారాల్లో ఎపుడూ బిజీగా ఉండే.. సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి వీలుచిక్కినపుడల్లా సొంతూరి ప్రజల సేవలో నిమగ్నవుతారు. ముఖ్యమంత్రి జపాన్ పర్యటనలో ఉన్న నేపథ్యంలో సమయం చూసుకుని గత రెండురోజులుగా స్వగ్రామ, మండల ప్రజల సమస్యలు విన్నారు. పలు సమస్యలను అప్పటికపుడే పరిష్కరించారు. మహబూబాబాద్ నియోజకవర్గంలోని కేసముద్రం మండలం ఆర్పన్ పల్లి గ్రామంలో ఉంటూ స్థానిక ప్రజల నుంచి ప్రజా సమస్యలపై అర్జీలను స్వీకరించి,సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ పరిష్కారం చూపారు. కేసముద్రం మండల కేంద్రానికి అగ్నిమాపక కేంద్రం, షాదీఖానా, గ్రామాలకు రోడ్లు మంజూరు కావడంతో స్థానిక ముస్లిం నాయకులు,కార్యకర్తలు వేం నరేందర్ రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలియజేశారు.

## రాహుల్ గాంధీ ద్వంద్వ పౌరసత్వం కేసు

**ఆ దేశానికి లేఖ రాసిన కేంద్రం**

**మహా:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి బ్రిటిష్ పౌరసత్వం ఉందన్న ప్రచారం నేపథ్యంలో వివరాలు కోరుతూ యూకే ప్రభుత్వానికి లేఖ రాసినట్లు కేంద్రం అలహాబాద్ హైకోర్టుకు సోమవారం తెలియజేసింది. బ్రిటిష్ పౌరసత్వం ఉందని, ఆయన లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ కర్ణాటకకు చెందిన బీజేపీ కార్యకర్త ఎస్ విఘ్నేష్ శిశిర్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని జస్టిస్ ఏఆర్ మసూది, జస్టిస్ రాజీవ్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. రాహుల్ గాంధీ బ్రిటిష్ పౌరసత్వం గురించి వివరాలు కోరుతూ యూకే ప్రభుత్వానికి కేంద్రం లేఖ రాసిందని, అందువల్ల నివేదికను సమర్పించడానికి మరింత సమయం అవసరమని డిప్యూటీ సొలిసిటర్ జనరల్ ఎస్‌బీ పాండే కోర్టుకు తెలియజేశారు. ఈమేరకు రాహుల్ గాంధీ పౌరసత్వానికి సంబంధించిన పత్రాలను మే 5 వరకు సమర్పించాలని కేంద్రానికి హైకోర్టు సమయం ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం గతంలో ఈ అంశంపై సమయం కావాలని హైకోర్టును కోరింది. గతేడాది నవంబర్ 25న పిల్ విచారించిన సమయంలో కేంద్రం నుంచి హైకోర్టు సమాచారన్ని కోరింది. ఆ సమయంలో వివరాలను సేకరించేందుకు సమయం కావాలని అడిగింది. ఇప్పుడు రెండోసారి కేంద్రం సమయాన్ని కోరడం గమనార్హం. రాహుల్ గాంధీ బ్రిటిష్ పౌరుడని నిరూపించే పత్రాలు, బ్రిటిష్ ప్రభుత్వానికి చెందిన కొన్ని ఈమెయిల్‌లు తన వద్ద ఉన్నాయని పిటీషనర్ తన పిల్‌లో పేర్కొన్నారు. ఆయన భారతదేశంలో ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హుడని, ఆయన లోక్‌సభ సభ్యతాన్ని రద్దు చేయాలని కోరారు. అయితే రాహుల్ గాంధీ ద్వంద్వ పౌరసత్వంపై తాను రెండు ఫిర్యాదులు పంపానని, కానీ అధికారులు ఎలాంటి చర్య తీసుకోలేదని పిటిషనర్ కోర్టుకు తెలిపారు.

## సమస్యలను శాశ్వతంగా పరిష్కరించుకోవాలి

**ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**

ఇబ్రహీంపట్నం శాసన సభ్యులు మల్ రెడ్డి రంగా రెడ్డి మాట్లాడుతూ... నియోజక వర్గంలోని అన్ని గ్రామాల ప్రజలు భూ భారతి చట్టంపై అవగాహన పెంపొందించుకొని దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించుకోవాలని అన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణితో గ్రామాలలో కుటుంబాల మధ్య, అన్నదమ్ముళ్ళ మధ్య చిచ్చు పెట్టించి, వారి మధ్య విభేదాలను సృష్టించారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రైతుల మేలు కోసం భూ భారతిని తెచ్చారని తెలిపారు. రైతు బిడ్డకు మాత్రమే రైతుల కష్టాలు, భూమితో రైతుకు ఉన్న అనుబంధం తెలుస్తుందని, భూ భారతి అమలుతో రాష్ట్రంలోని రైతులందరికీ మేలు జరుగుతుంది. పైరవీలు అవసరం లేదు. పోర్టల్‌లో పరిష్కారాలు భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, భూమికి సంబంధించిన సమస్త సమాచారం అందుబాటులో ఉంటుందన్నారు. భూముల అమ్మకాలు, కొనుగోలు సులభంగా జరుగుతాయన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ ఛైర్మన్ కోదండ రెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, ఆర్డీఓ అనంత్ రెడ్డి, శ్రీనివాసరావు, ఏసిపి కెపివి రాజు, డిసిసిబి చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నరసింహ రెడ్డి, ఫ్రూట్ మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ ఏదుళ్ళ పాండు రంగారెడ్డి, ఎమ్మార్వోలు, ఆర్ఐలు అధికారులు, నాయకులు మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, డైరెక్టర్ ముత్యాల రాజశేఖర్, ఈ చంద్రశేఖర్ మామ, భూపతిగల్ల మహిపాల్ వరికుప్పల సుధాకర్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు జయమ్మ, తుర్కయంజాల్ అధ్యక్షురాలు కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్, స్థానిక రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ లో అత్యాధునిక చిన్న ఆయుధాల
# తయారీ కేంద్రం ప్రారంభం

**ఆయుధాల ఉత్పత్తిని ప్రారంభించిన ఎంఈఐఎల్ గ్రూప్ సంస్థ ఐకామ్**

ఆయుధాల తయారీకి యుఎఇకి చెందిన ఎడ్జ్ గ్రూప్ సంస్థ క్యారకల్ సాంకేతిక సహకారం

ఇప్పటికే రెండు సంస్థల మధ్య కుదిరిన లైసెన్సింగ్ ఒప్పందం

క్యారకల్ పేరుపై ఆయుధాలను తయారు చేయనున్న ఐకామ్

ఆయుధాల తయారీలో భారత్ కు తొలిసారి సాంకేతిక సహకారాన్ని అందిస్తున్న యుఎఇ

**మహా:** దేశ రక్షణ రంగంలో కీలక పాత్ర పోషించే ప్రపంచ శ్రేణి చిన్న ఆయుధాల తయారీ కేంద్రాన్ని మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) గ్రూప్ సంస్థ ఐకామ్ సోమవారం ప్రారంభించింది. ఐకామ్ సమీకృత ఇంజనీరింగ్ విభాగం ఆవరణలో ఈ ఆయుధ తయారీ కేంద్రాన్ని ఐ కామ్ టెలీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సుమంత్ పాతూరు, క్యారకల్ సిఈఓ హమద్ అల్ అమెరి సంయుక్తంగా ప్రారంభించారు. మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ లో భాగంగా ఇక్కడ తయారయ్యే ఆయుధాలు భారత సాయుధ దళాలు, సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్సెస్ ( సిఏపీఎఫ్,ఎస్ ), సాయుధ బలగాలు, రాష్ట్ర పోలీస్ బలగాలు, ఎస్ పీ జీ వంటి సంస్థల కీలక అవసరాలను తీరుస్తాయి. అలాగే క్యారకల్ సంస్థ ప్రపంచంలోని వివిధ దేశాలకు ఆయుధాల్ని ఎగుమతి చేసేందుకు హైదరాబాద్ లోని ఆయుధ తయారీ కేంద్రం ఉపయోగపడుతుంది. యూఏఈ సంస్థ భారత దేశానికి తొలిసారి చిన్న ఆయుధాల తయారీకి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తోంది. క్యారకల్, హైదరాబాద్ లో ఉన్న ఐ కామ్ కేంద్రంలో మిషన్‌ప్రూవెన్ కార్ 816 క్లోజ్‌క్వార్టర్స్ బాటిల్ రైఫిల్, లక్ష్యాన్ని ఛేధించగలిగే కార్ 817 అసాల్ట్ రైఫిల్, తేలికపాటి సి ఎస్ ఆర్ 338, 308 బోల్ట్‌యాక్షన్ స్నిపర్ రైఫిల్స్, లక్ష్యాన్ని ఛేదించే అత్యంత ఖచ్చితమైన సి ఎస్ ఆర్ 50 బోల్ట్‌యాక్షన్




యాంటీమెటీరియల్ స్నిపర్ రైఫిల్, ఆధునిక సి ఎం పీ 9 సబ్మెషిన్ గన్, పలు రకాలుగా ఉపయోగపడే క్యారకల్ ఈ ఎఫ్, క్యారకల్ ఎఫ్ జెన్ 2 కాంబాక్ట్ పిస్టల్స్ తయారు చేస్తారు.

ఈ సందర్భంగా ఐకామ్ టెలీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సుమంత్ పాతూరు మాట్లాడుతూ ఈ కర్మాగారం భారతదేశ రక్షణ దళాలకు తమ తిరుగులేని నిబద్ధత, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆత్మనిర్భర్ భారత్ దృష్టిపై మా నమ్మకానికి నిదర్శనంగా నిలుస్తుంది. ఐకామ్లో, దేశంతో పాటు ప్రపంచానికి ఉపయోగపడే విధంగా ఆయుధాలను తయారు చేస్తున్నామని తెలిపారు. తమ ఆయుధ తయారీ కేంద్రం కారకల్తో చారిత్రాత్మక సాంకేతిక బదిలీ (టి ఓ టి ) ఒప్పందం కింద అత్యాధునిక సమగ్ర శ్రేణి ఆయుధాల తయారీ కేంద్రంగా పనిచేస్తుంది, ఇది యూఏఈభారతదేశ రక్షణ సహకారంలో ఒక మైలురాయిని సూచిస్తుంది అన్నారు. విశ్వసనీయ, దూరదృష్టి గల భాగస్వామి క్యారకల్ తో కలిసి, మేము ప్రపంచ స్థాయి ఆయుధాలను మాత్రమే కాకుండా, ధైర్యమైన, స్వయంసమృద్ధి గల భారతదేశాన్ని నిర్మిస్తున్నామని అన్నారు. నూతన ఆయుధ తయారీ కేంద్రం భారత దేశ ఆత్మనిర్భర్ భారత్, మేక్ ఇన్ ఇండియా ప్రయాణంలో ఒక మూలస్తంభం, ఇది ప్రపంచ సాంకేతికతను మన దేశ నైపుణ్యంతో మిళితం చేస్తుంది. ఇది కారకల్ అంతర్జాతీయ కార్యక్రమాలకు మద్దతు ఇస్తుంది, భారతదేశాన్ని విశ్వసనీయమైన ప్రపంచ రక్షణ ఉత్పత్తి కేంద్రంగా బలోపేతం చేస్తుంది అని సుమంత్ అన్నారు. క్యారకల్ సి ఈ ఓ హమద్ అల్ అమెరి మాట్లాడుతూ: ఐకామ్ క్యారకల్ చిన్న ఆయుధాల తయారీ కేంద్రం ప్రారంభం భారతీయ మార్కెట్ , రక్షణ పరిశ్రమకు మద్దతు ఇవ్వడానికి తమ ప్రయత్నాలలో ఒక మైలురాయిని సూచిస్తుంది అన్నారు. ఐకామ్ ప్రపంచ స్థాయి తయారీ నైపుణ్యం, జాతీయ స్వావలంబన పట్ల బలమైన నిబద్ధత కలిగిన అత్యంత సమర్థవంతమైన, విశ్వసనీయమైన భాగస్వామి అని నిరూపించబడింది అని అమెరి అన్నారు ."యూఏఈ నుండి భారతదేశానికి జరిగిన మొట్టమొదటి చిన్న ఆయుధాల సాంకేతిక బదిలీ వల్లే ఐకామ్, క్యారకల్ ఆయుధ తయారీ కేంద్రం ప్రారంభం సాధ్యమైంది. ఈ కర్మాగారం ప్రధాన మంత్రి మోదీ 'మేక్ ఇన్ ఇండియా' చొరవకు, మా నిబద్ధతకు నిదర్శనం. ఈ కేంద్రం ఏర్పాటు ద్వారా భారత దేశ రక్షణ వ్యవస్థలో మా పాత్రను మరింతగా పెంచుతున్నందుకు గర్విస్తున్నాము అని అమెరి అన్నారు.

## యువత, విద్యార్థులే లక్ష్యంగా ఈ-సిగరెట్లు విక్రయిస్తున్న
# ముఠా అరెస్టు

**వాట్సాప్‌లో ప్రత్యేక గ్రూప్‌తో విక్రయం**

**నిందితుల నుంచి అమెరికన్, కెనడియన్ డాలర్లు స్వాధీనం**

**మహా :** హైదరాబాద్ నగరంలో నిషేధిత ఈసిగరెట్లు (వేప్‌లు) అక్రమంగా విక్రయిస్తున్న ముఠాను తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీ న్యాబ్) అధికారులు, స్థానిక పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. ముఖ్యంగా విద్యాసంస్థల సమీపంలో యువత, విద్యార్థులే లక్ష్యంగా ఈ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ ముఠా సభ్యులు నగరంలోని పలు కళాశాలలు, పాఠశాలల వద్ద యువతను ఆకర్షించి వారికి ఈసిగరెట్లు, వేపింగ్ పరికరాలను విక్రయిస్తున్నారు. ఇందుకోసం 'ఎస్ఐడీ' అనే పేరుతో ఒక ప్రత్యేక వాట్సప్ గ్రూప్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ గ్రూప్ ద్వారా సుమారు 500 మందికి పైగా వినియోగదారులకు ఈ నిషేధిత ఉత్పత్తులను సరఫరా చేస్తున్నారని అధికారులు గుర్తించారు. అరెస్టయిన నిందితులు హైదరాబాద్‌లోని నాంపల్లి ప్రాంతానికి చెందిన అన్నదమ్ములుగా పోలీసులు గుర్తించారు. వీరికి ఢిల్లీకి చెందిన అమిత్, ముంబైకి చెందిన వసీం అనే వ్యక్తులు ప్రధాన సరఫరాదారులుగా వ్యవహరిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది.

## సుప్రసిద్ధ అక్షర్ ధామ్ ఆలయాన్ని సందర్శించిన జేడీ వాన్స్ కుటుంబం

**తొలి కార్యక్రమంగా ఢిల్లీ అక్షరధామ్ ఆలయ సందర్శన**

**ఆలయ కళ, వాస్తుశిల్పం, విలువలను మెచ్చుకున్న వాన్స్**

**భారతీయ వస్త్రధారణలో ఆకట్టుకున్న వాన్స్ పిల్లలు**

**మహా :** నాలుగు రోజుల భారత పర్యటన నిమిత్తం సోమవారం ఉదగయం ఢిల్లీకి చేరుకున్న అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తన అర్ధాంగి ఉషా వాన్స్, ముగ్గురు పిల్లలతో కలిసి ఆయన తన పర్యటనను యమునా నదీ తీరంలోని విశాలమైన స్వామినారాయణ అక్షరధామ్ ఆలయ సందర్శనతో ఆరంభించారు. వాన్స్ కుటుంబం ఆలయ ప్రాంగణంలో దాదాపు గంట సమయం గడిపింది. వారికి ఆలయ నిర్వాహకులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం వారు ఆలయంలో స్వామివారి దర్శనం చేసుకున్నారు. భారతీయ సంప్రదాయ వస్త్రధారణలో ఉన్న వాన్స్ పిల్లలు ఇవాన్, వివేక్, మిరాబెల్ ఈ సందర్భంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆలయ సందర్శన అనంతరం ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సందర్శకుల పుస్తకంలో తన అనుభూతిని పంచుకున్నారు. "ఈ అద్భుత ప్రదేశానికి నన్ను, నా కుటుంబాన్ని ఆహ్వానించి, ఆదరించిన మీ దయ, ఆతిథ్యానికి ధన్యవాదాలు. ఇంతటి సుందరమైన ఆలయాన్ని ఎంతో నిబద్ధతతో, శ్రద్ధతో నిర్మించడం భారతదేశానికి గర్వకారణం. ముఖ్యంగా మా పిల్లలు దీన్ని ఎంతగానో ఇష్టపడ్డారు. దేవుడి ఆశీస్సు



లు మీకుండాలి" అని ఆయన పేర్కొన్నారు. ఆలయంలో ఏనుగుల శిల్పాలతో అలంకరించబడిన గజేంద్ర పీఠం వాన్స్‌ను విశేషంగా ఆకట్టుకుందని, ఆలయ ప్రాంగణంలో తనకు ఎంతో ప్రశాంతత లభించిందని ఆయన వ్యాఖ్యానించినట్లు ఆలయ వాలంటీర్ ఒకరు తెలిపారు. ఈ సందర్భంగా వాన్స్ కుటుంబానికి చెక్కతో చేసిన ఏనుగు ప్రతిమ, ఢిల్లీ అక్షరధామ్ ఆలయ నమూనా, పిల్లల పుస్తకాలను బహూకరించినట్లు ఆలయ పూజారి ఒకరు వెల్లడించారు. వాన్స్ కుటుంబం ఆలయంలోని అద్భుతమైన కళ, వాస్తుశిల్పాన్ని పరిశీలించిందని, భారతదేశ వారసత్వం, సాంస్కృతిక లోతును అనుభూతి చెందారని, అలాగే సామరస్యం, కుటుంబ విలువలు, శాశ్వత జ్ఞానం వంటి సందేశాలను అభినందించారని ఆలయ నిర్వాహకులు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తెలిపారు.

# మావోయిస్టులకు భారీ నష్టం



**ఎన్ కౌంటర్ లో సెంట్రల్ కమిటీ సభ్యుడు వివేక్ హతం.. ప్రయాగ్ మాంఝీపై రూ. కోటి రివార్డ్**

**మరో 8 మంది మావోయిస్టులు మృతి..209 కోబ్రా బెటాలియన్, ఝార్ఖండ్ పోలీసుల ఆపరేషన్**

**మహా :** ఝార్ఖండ్‌లోని బొకారో జిల్లాలో మావోయిస్టులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. లాల్ పానియా ప్రాంతంలోని లుగూ హిల్స్ వద్ద సోమవారం ఉదయం కోబ్రా దళాలతో జరిగిన ఎన్ కౌంటర్‌లో మావోయిస్టు కీలక నేత, సెంట్రల్ కమిటీ సభ్యుడు ప్రయాగ్ మాంఝీ అలియాస్ వివేక్ సహా 8 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఇప్పటికే వివేక్ పేరిట రూ.కోటి రివార్డ్‌ను ప్రకటించినట్లు పోలీసులు వెల్లడించారు. అతడిని పుచన, నాగ మాంఝీ, కరన్, లెతర అనే పేర్లతో కూడా పిలుస్తారని తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్లో చనిపోయిన ఎనిమిది మందిలో అరవింద్, రామ్ మాంఝీ అనే మావోయిస్టులు ఉన్నట్లు వివరించారు. వీరిపై కూడా రూ.10 లక్షలు చొప్పున రివార్డులు ఉన్నాయని చెప్పారు.

**ప్రశాంత్ హిల్స్ అతడి అడ్డా**

కేంద్ర కమిటీ సభ్యుడైన ప్రయాగ్ మాంఝీ, ధనాబాద్ జిల్లా తుండీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దల్‌బుద గ్రామంలో పుట్టాడు. ఝార్ఖండ్, బిహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలో జరిగిన దాదాపు 100దాడుల్లో ఇతడి హస్తం ఉంది. ముఖ్యంగా ప్రశాంత్ హిల్స్ కేంద్రంగా చేసుకుని తన కార్యకలాపాలు నిర్వహించేవాడు. ఒక్క గిరిధి జిల్లాలోనే ఇతడిపై 50 కేసులతో పాటు రూ.కోటి రివార్డు ప్రకటించారు. ఝార్ఖండ్‌లో అత్యధిక రివార్డ్ ఉన్న రెండో మావోయిస్టు ఇతడేనని పోలీసులు చెప్పారు. మాంఝీ కాకుండా మరో నలుగురి పైనే రూ.కోటి రివార్డులు ఉన్నాయని వివరించారు. ఇతడు పరస్నాథ్ ప్రాంతంలోకి ప్రవేశించినట్లు సమాచారం అందడంతో పోలీసులు వేగులను అప్రమత్తం చేసి హతం చేశారు.

**ఏడాది క్రితమే భార్య అరెస్ట్**

ప్రయాగ్ మాంఝీ భార్య జయాను గతడాది పోలీసులు అరెస్టు చేశారు. ఆమె క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఈ క్రమంలోనే చికిత్స తీసుకోవడానికి బయటకు రాగా ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత చికిత్స పొందుతూ జయా మృతి చెందింది. సోమవారం తెల్లవారుజామున బొకారో జిల్లాలోని లాల్‌పానియా ప్రాంతంలో సీఆర్‌పీఎఫ్, రాష్ట్ర పోలీసులు కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు. వీరికి లుగు హిల్స్ వద్ద మావోయిస్టులు ఎదురు పడటంతో ఎన్‌కౌంటర్ ప్రారంభమైంది. ఆ తర్వాత కొద్దిసేపటికి నక్సలైట్లు అడవుల్లోకి పారిపోయారు. అనంతరం మొత్తం 8 మృతదేహాలను స్వాధీనం చేసుకోగా, వీరిలో ప్రయాగ్ ఉన్నట్లు గుర్తించారు. తాజా ఆపరేషన్‌లో ఎస్ఎల్ఆర్, ఇన్సాస్ వంటి భారీ ఆయుధాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. 209 కోబ్రా బెటాలియన్, ఝార్ఖండ్ పోలీసులు ఇందులో పాల్గొన్నారు. ఈ ఏడాది ఝార్ఖండ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లలో మొత్తం 13 మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. 2025 చివరికి రాష్ట్రాన్ని మావో రహిత రాష్ట్రంగా చేయాలని పోలీసులు లక్ష్యంగా పెట్టుకొన్నారు. ఇప్పటికే 244 మంది మావోయిస్టులను రాష్ట్రంలో అరెస్టు చేయగా, పలు దళాల కమాండర్లతో కలిపి 24 మంది లొంగిపోయారు

EDITORIAL సంపాదకీయం

# రేవంత్ సర్కారును పడగొట్టే కుట్రలు చేస్తున్నది వారే?

**"ఈ ప్రభుత్వం కొసెల్తదా"? అని తమ ఛానల్ రిపోర్టర్ ఒకరిని,ప్రముఖ న్యూస్ ఛానల్ చైర్మన్ రెండు నెలల కిందట అడిగాడు. కొసెల్తదా ! అనేది పక్కా తెలంగాణ మాండలికపు పదం. కేసీఆర్,రేవంత్ రెడ్డికి బాగా తెలుసు.' కొసెల్లడం' అంటే చివరివరకు ఉంటుందా? అని అర్థం.'రేవంత్ కొసెల్లుతడా' అంటే ఆయన ముఖ్యమంత్రిగా పూర్తి కాలం ఐదేండ్లు పదవిలో ఉంటారా? అనే అర్థం వస్తుంది. ఆ న్యూస్ ఛానల్ చైర్మన్ ఒక్కరే కాదు,కొన్ని దినపత్రికల అధిపతులు,ఢక్కా ముక్కీలు తిన్న సీనియర్ జర్నలిస్టులు కూడా ఈ విషయంపై ఆరా తీస్తున్నారు. అంతలా మీడియాలో అనుమానాలు కల్గడానికి కారణం బిఆర్ఎస్ వ్యవహార శైలి,ఆ పార్టీ నాయకుల ప్రకటనలు,వ్యాఖ్యలు,చిట్ చాట్ లు. రేవంత్ ప్రభుత్వం ఎన్నో రోజులు మనజాలదని కేసీఆర్ 2024 మార్చి,ఏప్రిల్ ప్రాంతాల్లోనే అన్నారు. అప్పటికి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టి బహుశా నాలుగైదు నెలలే.120 లేదా 150 రోజుల్లోనే రాష్ట్రాన్ని అధోగతి పాల్జేశారంటూ మాజీ సీఎం కేసీఆర్ నిర్ధారించేశారు. ఇక ఇప్పుడు 15 నెలలు గడుస్తున్నాయి కనుక 'కొసెల్లడాని'కి సంబంధించిన 'డోసు' పెంచారు.**





- ఎస్.కే.జకీర్, సీనియర్ జర్నలిస్ట్

"దిక్కుమాలిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టే కర్మ మాకు లేదు. రేవంత్‌రెడ్డి చేస్తున్న లుచ్చా పనులకు జనమే రోడ్లమీదకు వచ్చి బంగ్లాదేశ్‌లో మాదిరిగా ప్రభుత్వాన్ని పడగొడతారు'' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏప్రిల్ 17 న ఒక 'తీర్పు' ఇచ్చారు. ''ఈ ఐదేళ్లు సీఎంగా రేవంతే ఉండాలని మేం కోరుకుంటున్నాం.ఆ తర్వాత ఎలాగూ మేం 20ఏళ్ల పాటు అధికారంలో ఉంటాం.సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ఆత్మాభిమానం,పౌరుషం,సిగ్గుంటే రేవంత్‌రెడ్డి సీఎం పదవికి రాజీనామా చేసేవారు''అని కూడా కేటీఆర్ అన్నారు. కంచ గచ్చిబౌలి ప్రాంతంలోని 400 ఎకరాల భూముల్లో ప్రభుత్వం తలపెట్టిన కార్యక్రమాలకు వ్యతిరేకంగా బిఆర్ఎస్ భూమ్యాకాశాలను ఏకం చేస్తూ సాగిస్తున్న ప్రచారం ఆ పార్టీ మినహా మరెవరూ చేయలేరు. ఎర్రవల్లి యూనివర్సిటీ 'ఉత్పత్తులే' భిన్నమైనవి. జాతీయ,అంతర్జాతీయ స్థాయి సోషల్ మీడియా వ్యక్తులు,యూట్యూబర్లను ప్రభావితం చేసి తెలంగాణ ప్రభుత్వాన్ని 'బజారు'కు ఈడ్వడంలో గొప్ప ప్రతిభను కనబరచారని ఆ పార్టీ భజన బృందాలు ప్రశంసిస్తున్నవి.

''తెలంగాణ పోలీసుల్లో కొంత మంది రేవంత్‌రెడ్డి ప్రైవేట్ సైన్యంలా పని చేస్తున్నారు.వారిపై సుప్రీం కోర్టుకు వెడతాం.కేంద్ర సాధికారిక కమిటీ నివేదిక ఆధారంగా సుప్రీం కోర్టు జడ్జితో విచారణ చేయించాలని డిమాండ్ చేస్తున్నాం. ప్రధాని నిర్ణయంలో జాప్యం జరిగితే ఏప్రిల్ 27తర్వాత కేంద్ర ప్రభుత్వ సంస్థల వద్దకు వెళ్లి ఆధారాలు అందిస్తాం''.అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకటించారు.అసలు పోలీసులను తమ పార్టీ కార్యకర్తలుగా ఎంతగా వాడుకున్నారో 'ఫోన్ ట్యాపింగ్' కేసుతో పాటు,2023 అసెంబ్లీ ఎన్నికల వేళ తమ పార్టీ అభ్యర్థులకు పోలీసు వాహనాల్లో డబ్బు పంపిణీ చేసిన తీరు... వంటి ఆరోపణలు కోకొల్లలుగా ఉన్నాయి.ఆయా కేసులపై విచారం జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమెరికాకు పారిపోయిన ఎస్.ఐ.బీ.మాజీ చీఫ్ ప్రభాకరరావు తెలంగాణకు వస్తే తప్ప నాటి ప్రభుత్వ 'భాగోతం' వెలుగులోకి రాదు.

అమెరికా నుంచి రాకుండా తప్పించుకోవడానికి సదరు 'రావు' అన్ని మార్గాలనూ అన్వేషిస్తున్నారు.క్యాన్సర్ చికిత్స కోసం అమెరికాలో ఉన్నట్టు మొదట చెప్పారు. తర్వాత రాజకీయ శరణార్థిగా గుర్తించాలని అమెరికా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.అందుకు అమెరికా ఒప్పుకోలేదు. గ్రీన్ కార్డు కోసం దరఖాస్తు చేసి భంగపడ్డారు .ఈ లోగా కేంద్రప్రభుత్వం ఆయనకు 'రెడ్ కార్నర్' నోటీసులు జారీ చేసింది.తనను అరెస్టు చేయబోమని షరతుకు ఒప్పుకుంటే హైదరాబాద్ వచ్చి విచారణకు హాజరవుతానని హైకోర్టుకు అప్పీల్ చేసుకున్నారు. అత్యంత కిరాతకమైన వ్యవస్థీకృత నేరంలో ప్రధాన నిందితునిగా ఉన్న వ్యక్తి ఇంత స్వేచ్ఛగా దాగుడు మూతలాడుతున్నారంటే ఖచ్చితంగా రాజకీయ,న్యాయపరమైన 'సలహాలు', సహకారం ఆయనకు అందుతున్నట్టు స్పష్టంగా తెలుస్తోంది.

అలాగే తమ సామాజికవర్గానికి చెందని సమర్థులైన పోలీసు అధికారులను శంకరగిరి మాన్యాలకు ఎలా పంపారో,దిక్కు దివాణం లేని పోస్టులకు బదిలీ చేశారో 'తండ్రీ,కొడుకులకు' తెలుసు. ప్రస్తుతం ఇంటెలిజెన్స్ డీ.జీ.శివధర్ రెడ్డి సహా పలువురు సీనియర్లు,తమకు నచ్చని వారు,తమకు అనుకూలంగా మసలుకోని సమర్థులను ఎలాంటి 'లూప్ లైన్' పోస్టింగ్ ఇచ్చారో పోలీసు శాఖకు తెలుసు. కనుక కొందరు పోలీసులు సీఎం రేవంత్ రెడ్డికి ప్రయివేటు సైన్యంలా పని చేస్తున్నారన్న విమర్శలు బిఆర్ఎస్ నాయకులనడం హాస్యాస్పదం. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్టు కొన్ని నెలలుగా ప్రచారం సాగుతోంది.

కాంగ్రెస్ పార్టీకి 64 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు.బీఆర్ఎస్ నుంచి మరో 10 మంది ఎమ్మెల్యేలు అధికార పార్టీలో చేరారు.కాంగ్రెస్ పార్టీ మిత్రపక్షం సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కూడా ఉన్నారు. మజ్లీస్ పార్టీ,కాంగ్రెస్ అవగాహనతో కలిసి వెడుతున్నవి.దాంతో కాంగ్రెస్ పార్టీ బలం దాదాపు 82 కు చేరుకుంది.ఈ సమయంలో బీఆర్ఎస్ కు చెందిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి.. 'ఎమ్మెల్యేలను కొనే ప్రయత్నాలు జరుగుతున్నాయ'ని హాట్‌కామెంట్స్ చేయడం చర్చనీయాంశంగా మారింది.అసలు కాంగ్రెస్ సర్కార్‌ను బిల్డర్లు, పారిశ్రామిక వేత్తలు ఎందుకు పడగొట్టాలని భావిస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.పైగా కొత్త ప్రభాకరరెడ్డి వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమైనవిగా బిఆర్ఎస్ నాయకత్వం ఖండిస్తుందని పలువురు ఆశించారు. కానీ స్వయంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆ వ్యాఖ్యలను గట్టిగా సమర్థించినందున 'ప్రభుత్వాన్ని పడగొట్టే' వ్యవహారం బిఆర్ఎస్ పాలసీగా అనుమానాలు గలుగుతున్నాయి.

''ఈ దరిద్రం ఇంకెంత కాలం.మీకు చాత కాకపోతే చెప్పండి.మేము చందాలు వేసుకుంటాం'' అని ప్రజలు తనను కూడా కోరుతున్నట్టు రామారావు అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్ల బిఆర్ఎస్ పార్టీకి ఎంత పగ, కసి ఉన్నాయో తేటతెల్లమైంది.దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను పరిశీలిస్తే,రేవంత్ ప్రభుత్వం పారిశ్రామికవేత్తలు,బిల్డర్ల కోసం పని చేయాలా లేక ప్రజలకోసం పని చేయాలా? అనే ప్రశ్నలు ఎదురవుతున్నవి.

**"ప్రజా మద్దతుతో గెలిచినా ప్రభుత్వాన్ని కూలిస్తే జనం చూస్తూ ఊరుకోరు. అసలు కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోవాలని కేసీఆర్ ఎందుకు కోరుకుంటున్నారో చెప్పాలి.16 నెలలుగా ప్రభుత్వం నడుస్తుంటే కాళ్లల కట్టెల అడ్డుపడే ప్రయత్నాలు చేస్తున్నారు. బీఆర్ఎస్ నేతలు పారిశ్రామిక వేత్తల దగ్గర డబ్బు వసూళ్ల దందా కొత్త విషయమేమీ కాదు.అలా అక్కడ పైసలు తీసుకొని ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర చేస్తే ఎవరు చూస్తూ ఊరుకోరు" అని మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా హెచ్చరించారు."10 ఏళ్లు అధికారం అనుభవించిన కేసీఆర్ ఆ మత్తు నుంచి బయటపడలేక ప్రభుత్వాన్ని కూల్చాలని ప్రయత్నిస్తున్నారు. ప్రతిసారి కేసీఆర్ నోటినుంచి వచ్చే మాటలు కొత్త ప్రభాకర్ రెడ్డి,కేటీఆర్ ల నోట వచ్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డనాటి నుంచి తండ్రి కొడుకులు కూల్చే కుట్రలు చేస్తున్నారు"అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిప్పులు చెరిగారు. ప్రభుత్వాన్ని కూల్చే కుట్రలు జరుగుతున్నాయని, సీఎం రేవంత్ రెడ్డి సీరియస్‌గా తీసుకుని వెంటనే విచారణకు ఆదేశించాలని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు.**

కేసీఆర్ ప్రభుత్వం గొప్పలకు పోయి సాగులో లేని భూములు, రాళ్లు,రప్పలు,గుట్టలు,రోడ్లు,పరిశ్రమలుగా రూపాంతరం చెందిన వాటికి,లే అవుట్లు వేసిన వాళ్లకు కూడా రైతు బంధు కింద డబ్బులు జమ చేసిన మాట నిజం.ఈ విధంగా 22,606 కోట్ల రూపాయలు దుర్వినియోగానికి గురయ్యాయి. గత ప్రభుత్వం మొత్తం 72,816 కోట్ల రూపాయలను రైతు బంధు పథకం కింద జమ చేయగా ఇందులో 22,606 కోట్ల రూపాయలు అయాచితంగా అనర్హులకు చేరాయి.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యాన్ని వహిస్తోన్న గజ్వేల్ నియోజకవర్గంలో రాజీవ్ రహదారి,ఆమనగల్‌లో శ్రీశైలం రోడ్ల కింద పోయిన భూములకు కూడా రైతు బంధు పథకం కింద నిధులు అందాయని ప్రభుత్వ రికార్డులు చెబుతున్నవి.కొన్ని చోట్ల క్రషర్లు,మరికొన్నిచోట్ల మైనింగ్ జరుగుతున్న భూములకు కూడా రైతు బంధు ఇచ్చారు.గిరిజనులు,ఆదివాసీల పేర్ల మీద బీఆర్ఎస్ నాయకులు నకిలీ పాస్ పుస్తకాలను సృష్టించి రైతు బంధు కింద లబ్ది పొందినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2024 డిసెంబర్ అసెంబ్లీ సమావేశాల్లో చెప్పారు.''హైదరాబాద్‌కు చుట్టూ 50 కిలోమీటర్ల పరిధిలో 70 నుంచి 80 శాతం వ్యవసాయం ఎవరూ చేయడం లేదు. వ్యవసాయ స్థలాలన్నీ రియల్ ఎస్టేట్‌గా,లే అవుట్లుగా, ప్లాట్లుగా మారాయి. ప్రతి సంవత్సరం కూడా రెండు సీజన్లకు కలిపి మూడు కోట్ల హెక్టార్లకు డబ్బులు ఇచ్చుకుంటూ పోయారు'' అని సీఎం తెలిపారు. సీఎం రేవంత్ సూటిగా చేసిన విమర్శలు,ప్రభుత్వ గణాంకాలకు బిఆర్ఎస్ వైపు నుంచి తలా తోకా లేని జవాబులు వచ్చాయి.

**కాగా ధరణి స్థానంలో తీసుకువచ్చిన భూభారతి చట్టంతో గ్రామాల్లో పండుగ వాతావరణం కనిపిస్తోంది. కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం ధరణిని బంగాళాఖాతంలోకి విసిరేశారు. కేసీఆర్ రద్దు చేసిన వీఆర్వో వ్యవస్థను రేవంత్ ప్రభుత్వం పునరుద్ధరించడం ఒక గుణాత్మక మార్పు.పలు వ్యవస్థల లాగానే కేసీఆర్ హయాంలో రెవెన్యూ వ్యవస్థను కూడా నిర్వీర్యం చేశారు.అయితే ఇలాంటి వ్యవస్థను రద్దు చేసినప్పడల్లా ఆ ప్రభుత్వాలు మరల అధికారములోకి రాకుండా పడిపోయిన దాఖలాలు కళ్లగట్టినట్టుగా కనిపిస్తున్నాయి. రద్దయిన ప్రతిసారి కాంగ్రెస్ ప్రభుత్వం చొరవతో ప్రజాపాలన ఆలోచనతో అధికారంలోకి రాగానే గ్రామ రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించిన ఘటనలున్నవి.**

గ్రామ స్థాయిలో పనిచేసే ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టే విధంగా రేవంత్ రెడ్డి సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు.గ్రామ రెవెన్యూ వ్యవస్థలో పనిచేసే ఉద్యోగులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ,ఓసిలలో వెనుకబడిన తరగతులు అత్యంత సంఖ్యలో ఉండి 95% శాతం ఓటు బ్యాంకు కలిగి వున్న వ్యవస్థ ఇది.రెవెన్యూ వ్యవస్థను తిరిగి బలోపేతం చేయడానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కీలక పాత్ర పోషించారు.టిఆర్ఎస్ ప్రభుత్వంలో ఆత్మ గౌరవం లేని రెవెన్యూ శాఖకు పునర్జన్మనిచ్చిన మహానుభావుడుగా రేవంత్ రెడ్డిని విఆర్ఓలు ప్రశంసిస్తున్నారు.అసలు రెవెన్యూ శాఖనే లేకుండా చేయాలని కేసీఆర్ ప్రభుత్వం కుట్ర చేసినట్టు ఆరోపణలున్నవి. ప్రత్యేక రాష్ట్రం కోసం తెలంగాణ ఉద్యమం చేసి రాష్ట్రాన్ని సాధించడంలో మొదటి స్థానంలో నిలబడ్డ ఉద్యోగ సంఘాలు అందులో భాగంగా ఆనాటి ఉద్యమంలో పది జిల్లాల కలెక్టర్ కార్యాలయాలకు తాళాలు వేసిన ఘనత గ్రామస్థాయి ఉద్యోగులదే.

తెలంగాణలో పెట్టుబడులు పెట్టి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని జపాన్ కు చెందిన పలువురు పారిశ్రామిక, వ్యాపారవేత్తలు ముందుకొస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందానికి ఆశాజనకమైన వాతావరణం కనిపిస్తోంది.''దేశంలోనే కొత్త రాష్ట్రం. అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న తెలంగాణ మీకు హృదయపూర్వకంగా స్వాగతం పలుకుతోంది. జపాన్‌ను ఉదయించే సూర్యుడి దేశం అని పిలుస్తారు.మా ప్రభుత్వ నినాదం తెలంగాణ రైజింగ్.ఈ రోజు తెలంగాణ జపాన్‌లో ఉదయిస్తోంది.టోక్యో చాలా గొప్ప నగరం.ఇక్కడి మౌలిక సదుపాయాలు, పర్యావరణ పరిరక్షణ, ఆవిష్కరణలు అద్భుతం. జపాన్ ప్రజలు సౌమ్యులు, మర్యాదస్తులు, క్రమశిక్షణ కలిగినవారు.మీ నుంచి నేను ఎంతో నేర్చుకున్నాను. హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడానికి టోక్యో నుంచి చాలా నేర్చుకున్నాను.ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, నైపుణ్యం గల ప్రతిభ, స్థిరమైన విధానాలను ప్రజా ప్రభుత్వం అందిస్తుందని జపాన్ వ్యాపారవేత్తలకు మాటిచ్చాను. లైఫ్ సైన్సెస్, గ్లోబల్ కెపాబులిటీ సెంటర్లు, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వెహికిల్స్, టెక్స్ టైల్స్, ఏఐ డేటా సెంటర్లు, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని,భారత్, జపాన్ కలిసికట్టుగా ప్రపంచానికి అద్భుతమైన భవిష్యత్తును నిర్మిద్దామని పిలుపునిచ్చినట్టు'' సీఎం రేవంత్ తెలిపారు.దేశంలోనే మొదటి నెట్ జీరో ఇండస్ట్రియల్ సిటీగా హైదరాబాద్లో నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీ, దేశంలోనే అద్భుతంగా నిర్మించ తలపెట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ పై ప్రచార వీడియోలను రాష్ట్ర ప్రభుత్వం జపాన్ వేదికపై ప్రదర్శించింది.ఎలక్ట్రానిక్స్, అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎలక్ట్రిక్ వెహికిల్స్, టెక్స్ టైల్స్, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో జపాన్ కంపెనీలకు తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అనుకూలతలు, అవకాశాలను రాష్ట్ర వాణిజ్య పరిశ్రమల శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ వివరించారు.

తోషిబా కార్పొరేషన్ యొక్క అనుబంధ సంస్థ టీటీడీఐ (ట్రాన్స్‌మిషన్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ ఇండియా) తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకొచ్చాయి.విద్యుత్ సరఫరా, పంపిణీ రంగంలో పెట్టుబడులు, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వంతో ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది.ఈ ఒప్పందం ప్రకారం హైదరాబాద్ సమీపంలోని రుద్రారంలో టీటీడీఐ సర్జ్ అరెస్టర్స్ తయారీ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తుంది. వీటితో పాటు పవర్ ట్రాన్స్ఫార్మర్స్, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్స్, గ్యాస్ ఇన్సులేటెడ్ స్విచ్‌గేర్ (జీఐఎస్) తయారీ సామర్థ్యాన్ని విస్తరించడానికి ఇప్పటికే అక్కడ ఉన్న ఫ్యాక్టరీలను అప్‌గ్రేడ్ చేయనుంది.ఈ ప్రాజెక్ట్ కు రూ. 562 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నారు. అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించే ఈ కొత్త ఫ్యాక్టరీ విద్యుత్ రంగంలో పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడంతో పాటు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుంది.రుద్రారంలో ఇప్పటికే రెండు ఫ్యాక్టరీలను విజయవంతంగా నిర్వహిస్తున్న టీటీడీఐ, ఈ కొత్త పెట్టుబడితో మూడో ఫ్యాక్టరీ నెలకొల్పనుంది. ప్రస్తుతం ఉన్న ఫ్యాక్టరీల సామర్థ్యాన్ని విస్తరించనుంది. కొత్త పెట్టుబడులకు తోషిబా చేసుకున్న ఒప్పందం పారిశ్రామిక రంగంలో కొత్త ఉత్సాహమిస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు. అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక విధానాలు తమను ఆకట్టుకున్నాయని,కొత్త ఆవిష్కరణల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధత తెలంగాణను పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చుతున్నాయని టీటీడీఐ చైర్మన్ హిరోషి ఫురుటా అన్నారు.

# కంబోడియాతో చైనా దృఢ బంధం

కంబోడియా ఇది ఆగ్నేయ ఆసియాలో ఉన్న దేశం. పాత పేరు కంబోడియా. 1989,మే మాసంలో కంపూచియా గా పేరు మార్చుకుంది. కరెన్సీ రీయల్, భాష ఫ్రెంచ్, మతం బౌద్ధమతం. ప్రధాన ఎగుమతులు రబ్బర్, మిరియాలు, కలప, బియ్యం. దిగుమతులు, ఇంధనం, యంత్రసామాగ్రి మొదలైనవి. కంబోడియా ఎక్కువగా చైనా నుంచి వస్తువులు దిగుమతి చేసుకుంటున్న దేశం.కంబోడియా రాజధాని పూనోమ్ పెన్ చేరుకున్న జిన్ పింగ్ కు కంబోడియా రాజు నోరో డోమ్ షిహమె నీ ఘన స్వాగతం పలికారు. విమానాశ్రయం దిగగానే ఎర్ర తివాచి పై జిన్ పింగ్ నడిచారు. అమెరికా సుంకాలు చైనా పై భారీ స్థాయిలో ఉండడంతో చైనా ఆసియా ఖండం లో విస్తృత పర్యటనలు మొదలు పెట్టి ఆయా రాజ్యలతో మైత్రి కొనసాగిస్తోంది. జిన్ పింగ్ కంబోడియా రాయల్ ప్యాలెస్ కు వెళ్ళి మన పూర్వీకులు మన మధ్య గట్టి బంధం ఏర్పరిచారు అని చెప్పడం విశేషం. జిన్ పింగ్ సౌత్ ఈస్ట్ దేశాలు అయిన వియత్నం, మలేసియా దేశాలలో పర్యటించారు. ఆయా దేశాలతో సర్దుబాటు కూడా చేసుకున్నారు. అవి కూడా అమెరికాను కాదనుకుని చైనా పంచన చేరడం గమనార్హం. అమెరికా టారిఫ్ నెంబర్ గేమ్ ఆడుతోందని ఆగ్రహం వెలిబుచ్చారు. అమెరికా వేసిన సుంకాలను మేము పట్టించుకోం అని జిన్ పింగ్ వ్యాఖ్యనించారు. కంబోడియతో కొన్ని ఒప్పందాల విషయం పై స్పష్టత వచ్చిందని, ఇరు దేశాల మధ్య నూతన అభివృద్ధి, అవకాశాల కల్పన, సహకార ఒప్పందాలు మరియు ఆర్థిక, సాంకేతిక సహకారం ఇత్యాది విషయాలపై గౌరవ ఒప్పందాలు చేసుకున్నామని చెప్పారు. దీనికి కంబోడియా రాజు అంగీకారం తెలపడం, రెండు దేశాల మధ్య పటిష్ట బంధం ఏర్పడటం శుభసూచకం అని జిన్ పింగ్ చెప్పారు. భారత్ తో కొన్ని వైషమ్యాలు ఉన్నా మేము భారత్ ను ఒక మిత్రదేశంగా చూస్తున్నామని చెప్పడం జిన్ పింగ్ లో కొట్టోచ్చిన మార్పుగా కనపడుతోంది. తమ వస్తువులకు అతి పెద్ద మార్కెట్ భారతే అని చెప్పడం విశేషం. అమెరికా సుంకాలకు వె రవక జిన్ పింగ్ పొరుగు దేశాలతో దృఢ సంబంధాలు ఏర్పరచుకునే పనిలో పడ్డారు. అమెరికా అధ్యక్షుడు వివిధ దేశాలపై విధిస్తున్న సుంకాలు, అమెరికాకే నష్టం. అందుకేనేమో సుంకాలపై తాత్కాలిక నిషేధం విధించారు. అతను తీసుకున్న నిర్ణయం సహే తుకంగా లేదని జిన్ పింగ్ వ్యాఖ్య. అతను విధించిన సుంకాలు రి పబ్లికన్ పార్టీ సభ్యులలో కూడా వ్యతిరేకించారు. కాకపోతే వాళ్ళు నోరు మెదపడం లేదని భోగట్టా. అమెరికా సుంకాల సంగతి అటుంచితే చైనా మాత్రం అమెరికా వ్యతిరేక శక్తు లతో చేయి కలిపి తన మార్కెట్ ను విస్తృత పరచుకోవాలనే వైఖరి తో ఉంది. ఈ దిశలో అమెరికా తమ దేశం పై విధించిన సుంకాల మూలంగా మేము కూడా ఆ దేశం పై సుంకా లతో బుద్ధి చెప్తుతామని



చైనా మనసులో మాటగా ఉంది. ఆసియా ఖండం లో అన్ని దేశాలతో మంచి సంబంధాలు కలిగి ఉంటామని చైనా అశతో ఉంది.

- కనుమ ఎల్లారెడ్డి, 93915 23027.

## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
74369 39999

# ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్

**వరంగల్ మహా:** డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదరాయపర్తి మండలంకొత్తూరు గ్రామంలో పర్యటించి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయుటకు అధికారులకు పలు సూచనలు చేశారు. పునాది , రూఫ్ లెవల్ లలో ఉన్న నిర్మాణం పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటివరకు నిర్మాణం పూర్తయిన పనులకు బిల్లులు చెల్లింపు చేయడం జరిగిందని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్న నేపథ్యంలో పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం రాయపర్తి మండల కేంద్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ గణపతి, టీజి ఈడబ్ల్యూఐడిసి డీఈ రామిశెట్టి రవీందర్ , ఏఈ కామిశెట్టి మురళీకృష్ణ, తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో గుగులోతు కిషన్ తదితరులు ఉన్నారు.



## బాల్య స్నేహితుడి కుటుంబానికి అండగా
## రూ.17,500 నగదును అందజేసిన టెన్త్ బ్యాచ్ మిత్రులు

**డోర్నకల్, మహా:** వారంతా చిన్ననాటి బాల్య స్నేహితులు.. కలిసిమెలిసి ఆటలాడుకుంటూ చదువుకున్నారు. పెద్దయి ఎవరికి వారు జీవితాలలో స్థిరపడ్డారు. ఇంతలో తమతో చదివిన చిన్ననాటి మిత్రుడు అనారోగ్యంతో అకాల మృతి చెందాడన్న విషయం తెలిసి చలించిపోయారు. ఎలాగైనా స్నేహితుని కుటుంబానికి అండగా నిలవాలని సంకల్పించుకోని స్నేహితులందరూ బృందంగా ఏర్పడి చేయి చేయి కలిపి చేతనైనంత సాయాన్ని అందించాలని నిర్ణయించుకున్నారు.మరిపెడ గ్రామానికి చెందిన మచ్చర్ల ఉప్పలయ్య (44) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. చనిపోయిన మిత్రుడి కుటుంబాన్ని సోమవారం 199495 పదవ తరగతి బ్యాచ్ కు చెందిన బాల్యమిత్రులు కలిసి పరామర్శించారు.ఈ సందర్భంగా స్నేహితుడి కుటుంబానికి మిత్రులు రూ.17,500 ఆర్థిక సాయాన్ని అందజేశారు.మానవతా దృక్పథంతో తోటి మిత్రునికి అండగా నిలిచి సాయాన్ని అందజేసిన స్నేహితులను



గ్రామస్థులు అభినందించారు. ముందు తరం వారికి మీ స్నేహబంధం ఆర్థిక సహాయం స్ఫూర్తిగా నిలుస్తుందని గ్రామస్తులు అన్నారు. అదేవిధంగా మచ్చర్ల ఉప్పలయ్య కుటుంబ సభ్యులు ఆర్థిక సహాయం అందజేసిన స్నేహితులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంధసిరి రమేష్, షేక్. తాజుద్దీన్, వంగవీటి కిరణ్, పోతుల గోవర్ధన్, మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి-బి.ఎం.ఎస్

**కరీంనగర్, మహా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని, కార్మిక సంక్షేమమును పూర్తిగా విస్మరించిందని భారతీయ మజ్దూర్ సంఘ్ (తెలంగాణ కన్స్ట్రక్షన్స్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.మోహన్ రెడ్డి విమర్శించారు. కరీంనగర్ లో జరిగిన బి ఎం ఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో కార్మిక శాఖకు మంత్రి లేదని ఎద్దేవా చేశారు.కార్మిక శాఖ అధికారుల ఇష్టారాజ్యమైందని ఆరోపించారు. భవన నిర్మాణ కార్మికులకు చెందవలసిన నిధులను పక్కదారి పట్టించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారని ఆయన ఆరోపించారు.కార్మికులకు కొత్త రూల్స్ పెట్టి లబ్ధిదారులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని, ఈ విషయంలో కార్మిక శాఖ అధికారులు తీరు మార్చుకోవాలని డిమాండ్ చేశారు. సంవత్సరం కాలంగా బోర్డు నుంచి అందాల్సిన పథకాల రూపాయలు అందట్లేవని



వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. 15 సంవత్సరాల నుండి కార్మికులకు కనీస వేతనం పెంపుకు నోచుకోవట్లేదని,ప్రభుత్వాలు కాలయాపన చేస్తూ కార్మికుల కడుపు కొడుతున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు .ఈ సమావేశంలో రాష్ట్రఅధ్యక్షులుసత్యనారాయణ,బి ఎం ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పప్పుల సురేష్,ప్రదీప్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కరీంనగర్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు పసుల శ్రావణ్,తోర్తి శ్రీనివాస్,మోగిలిపాలెం తిరుపతి,సత్యం తదితరులు పాల్గొన్నారు.

## జై బాపు, జై భీమ్, జై సంవిదాన్ నినాదంతో పాదయాత్ర

### యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కొరివి పరమేష్




**వరంగల్ మహా;** ఏఐసీసీ, టీపీసీసీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జై బాపు జై భీమ్ జై సంవిధాన్ నినాదంతో పాదయాత్ర కార్యక్రమాన్ని జెక్కిడి శివ చరణ్ ఆదేశాల మేరకు యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కొరివి పరమేష్ సోమవారం వరంగల్ నగరంలో విజయవంతంగా నిర్వహించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని కాశీబుగ్గ , ఓసిటీ ప్రాంతంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీతోపాటు పాదయాత్ర చేస్తూ, రాజ్యాంగ పరిరక్షణకై ప్రతి ఒక్క కాంగ్రెస్ సైనికుడు, బహుజనవాదులు ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు రాజు, రవి, సందీప్, చక్రి, సల్మాన్ రాజ్ హనుమకొండ గిరి పోలేపాక ఏ సబ్, సుమన్, అరవింద్, సన్నీ మండల పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ మండల జిల్లా నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, బహుజనవాదులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పని ప్రదేశాలలో కనీస సౌకర్యాలు మెరుగుపరచాలి

### కేంద్ర బడ్జెట్ లో నిధులు పెంచాలి

**పెండింగ్ లో ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ ల వేతనాలు వెంటనే చెల్లించాలి**

**తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాణాల రాజన్న**

**డోర్నకల్ ,మహా** :జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పని ప్రదేశాలలో కనీస సౌకర్యాలు మెరుగుపరిచి ఉపాధి కూలీలను ఆదుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మహబూబాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు బాణాల రాజన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిల్లంచర్ల గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి, సంఘ సభ్యత్వం చేర్పించి, అనంతరం రాజన్న మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకుందాం జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధికి నిధులు పెంచకుండా రెండున్నర లక్షలు ఉపాధి అవసరం ఉండగా బడ్జెట్లో 86000 కేటాయించి ఉపాధిని నిర్వీర్యం చేసే చర్యలు చేపడుతుందని రాజయ్య అన్నారు. పని ప్రదేశాలలో కూలీలకు నీడకు టెంటు త్రాగడానికి మంచినీరు మెడికల్ కిట్టు చిన్నపిల్లల సంరక్షణకు ఉంచటం వంటి సౌకర్యాలు కల్పించాలి. ఇలాంటి సౌకర్యాలు కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వై పల్యం చెందాయని వారన్నారు. ప్రభుత్వం పని చూపకపోతే చట్టపకారం




నిరుద్యోగ భృతి ఇవ్వాలి.పనిచేసిన కూలీలకు వారం వారం డబ్బులు చెల్లించాలి మెట్ల వ్యవస్థను పునరుద్ధించాలి. కేరళ వాపక్ష ప్రభుత్వం మోడలుగా పట్టణ ప్రాంత ప్రజలకు ఉపాధి పని వర్తింపజేయాలని పని దినాలు 150 రోజులకు పెంచాలని. ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనాలు పెంచి నెలవారీగా వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నబోయిన వెంకన్న, పిట్టల ధనంజి, సురేష్ అలవాల, నరేష్,చెన్నబోయిన ముత్తయ్య,లక్ష్మయ్య, పులి ఎంకన్న, భద్రయ్య, బండి మల్లయ్య,గాడిదల మాధవి,కేతమ్మ, బంధు సుగుణమ్మ, పాల్గొన్నారు.

# భూభారతి రైతులకు హక్కుల భద్రం

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**కాటారం, మహా :** నూతన భూ భారతి చట్టంతో భూముల హక్కులు భద్రంతో పాటు భూ సమస్యలు సత్వర పరిష్కారం జరుగుతాయని, రైతుల మేలుకోసం ప్రజాపాలనలో చారిత్రక మార్పు అని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు అన్నారు.సోమవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఏ.ఎస్.ఆర్ ఫంక్షన్ హాలులో జరిగిన భూ భారతి నూతన ఆర్ ఓ ఆర్ చట్టం అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి పాల్గొన్నారు.శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ భూమికి అన్ని హక్కులు కల్పించే విధంగా భూ భారతి చట్టం ప్రభుత్వం రూపొందించినట్లు, గత ప్రభుత్వం తెచ్చిన ధరణి వల్ల రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని, రెవెన్యూ అధికారులు పనిచేయడం లేదని అసత్య ప్రచారం చేసి ప్రజల్లో అధికారులను చులకన చేసారని తెలిపారు. గత ప్రభుత్వాహయంలో ధరణి పేరుతో ప్రజల భూములను దగా, దోపిడీ చేశారని, అనేక అక్రమాలు చేసి, వాళ్ళ కడుపులు నింపుకున్నారు తప్ప పేదలకు న్యాయం చేయలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ధరణిని బంగాళాఖాతంలో వేసి రైతులకు న్యాయం చేస్తామని ఇచ్చిన మాట ప్రకారం, రైతులకు ఒక ఆదర్శవంతమైన చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు. భూ మాత చట్టాన్ని 9 మంది సీనియర్ అధికారులతో కమిటీ వేసి భారతదేశంలోని అన్ని రాష్ట్రాల్లో అధ్యయనం చేసి కష్టపడి ప్రజలకు అనుకూల మైనటువంటి చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు.



కొత్తపల్లి గ్రామంలో సుమారు 70 సంవత్సరాలు నుండి సాగు చేసుకుంటున్న భూమికి పట్టాలు, పాస్ బుక్ రాకపోవడం వల్ల రైతు బంధు, రైతు బీమా, బ్యాంక్ రుణాలు రాక అమ్ముకుందామంటే రిజిస్ట్రేషన్ లేక పేద రైతులు అనేకమంది ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దున్నుకునే రైతులకు పట్టాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, నూతన చట్టం ప్రకారం అన్ని హక్కులు కల్పిస్తామని తెలిపారు. 30 రోజుల భూ సమస్యలు తహసిల్దార్ పరిష్కరించే విధంగా చట్టంలో పొందుపరిచినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ భూమికి భూధార్ కార్డు జారీ చేయనున్నట్లు తెలిపారు. దీని వల్ల అన్ని రికార్డులు పకడ్బందీగా నమోదు చేయబడతాయని తెలిపారు. 12 నుండి సాగులో ఉంటే విచారణ నిర్వహించి పట్టా ఇచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఉమ్మడి జిల్లాకు ఒకటి ల్యాండ్ ట్రిబ్యునల్ కూడా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 1989లో ఆర్ ఓ ఆర్ చట్టానికి రూల్స్ అమలు చేశారని తదుపరి 2020లో ధరణి చట్టం తీసుకు వచ్చారని కానీ ధరణిలో ఎలాంటి రూల్స్ పెట్టలేదని, 2025 లో వచ్చిన భూ భారతి చట్టంలో అన్ని రూల్స్ పెట్టినట్లు తెలిపారు. అసెంబ్లీలో భూ భారతి చట్టం అమలు జరిగిందని ఏప్రిల్ 14న గౌరవ ముఖ్యమంత్రి చట్టానికి రూల్స్ ఫ్రేమ్ చేసి ప్రారంభించారని తెలిపారు. 18 సంవత్సరాల తర్వాత ఆర్ ఓ ఆర్ రూల్స్ వచ్చాయని, దరణిలో రూల్స్ లేవని భూభారతి పోర్టల్ చట్టం ద్వారా పటిష్ఠమైనటువంటి చట్టాన్ని అందుబాటులో తీసుకొచ్చారని తెలిపారు. దీనివల్ల ప్రజలకు అందరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు.ఈ సమావేశంలో ట్రేడ్ కార్పోరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి ,అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డిఓ రవి, తహసిల్దార్ శ్రీనివాసులు, సింగిల్ విండో చైర్మన్ మేకల సంపత్ కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా

### ప్రతి కౌంటర్ ను స్వయంగా పరిశీలించినలో ఎర్రబెల్లి దయాకరరావు



**జనగామ, మహా;** ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్, బిఆర్ఎస్ నాయకులు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో పాలకుర్తిలోని బృందవన్ గార్డెన్ లో నిర్వహించిన మెగా జాబ్ మేళా కు యువత నిరుద్యోగుల నుండి విశేష స్పందన లభించింది. ఈ జాబ్ మేళాలో మల్టీ నేషనల్ కంపెనీలతో సహా మొత్తం 100 కంపెనీలు పాల్గొనగా, దాదాపు 5000 మందికి ఉద్యోగావకాశాలు కల్పించడానికి అవకాశాలు ఉండగా, ఆయా ఉద్యోగాల కోసం వేలాదిగా ఉద్యోగార్థులు భారీగా తరలివచ్చారు. పాలకుర్తి నియోజకవర్గంలోని పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల, తొర్రూరు, రాయపర్తి, పెద్దవంగర మండలాల నుంచి భారీగా తరలివచ్చిన ఉద్యోగార్థులు నియోజకవర్గం నుండే కాకుండా జిల్లాల వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు నిరుద్యోగులు జాబ్ మేళాలో ఇంటర్వ్యూలు చేసిన ఎం ఎన్ సి లు సహా 100 కంపెనీలలో అనేక మందికి ఉద్యోగాలు కల్పించడంలో ఆయా కంపెనీలు సుముఖత చూపారు. ఈ సందర్భంగా ఒక్కో కంపెనీ ఏర్పాటు చేసిన కౌంటర్ వద్దకు వెళ్ళి ఉద్యోగాల ఎంపికను స్వయంగా ఎర్రబెల్లి దయాకరరావు పరిశీలించి వారికి సూచనలు చేస్తూ ఉద్యోగార్థులతో ముచ్చటించి, వారి అర్హతలను బట్టి అవకాశాల పై చర్చించారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా పరిష్కారం**

**జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతో కలిసి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వర పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం (68) ఫిర్యాదులు వచ్చాయని, వాటిని



వెంటనే పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. రెవెన్యూ శాఖ -27, ఇతర శాఖలకు -41, మొత్తం (68) దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పెండింగ్ భూ సమస్యలకు భూభారతితో మోక్షం

### కొత్త చట్టంలో అప్పీలు వ్యవస్థ

- 30 రోజుల్లో మ్యూటేషన్ దరఖాస్తుల పరిష్కారం
- రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
- చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం

**కరీంనగర్, మహా:** ధరణి కారణంగా యేండ్ల తరబడి పెండింగ్ లో ఉన్న రైతు భూ సమస్యలకు భూభారతి చట్టం ద్వారా మోక్షం కలగనుందని చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం అన్నారు. సోమవారం గంగాధర మండల కేంద్రంలోని స్థానిక ఎస్.ఆర్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించినభూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టంపై అవగాహన కార్యక్రమానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి చట్టం రైతుల పాలిట శాపంగా మారిందని అన్నారు. ఏ తప్పూ చేయకుండానే రైతులను, అధికారులను ధరణి దోషులుగా నిలబెట్టిందని పేర్కొన్నారు. ధరణి చట్టంలోని లోపాలు రైతులు, అధికారుల మధ్య గొడవలు సృష్టించేలా చేశాయని, రైతులను ఆత్మహత్యలకు ఉసిగొల్పాయని అన్నారు. రైతుల పాలిట శాపంగా మారిన ధరణిని తొలగిస్తామని ఎన్నికలకు ముందు తమ పార్టీ మాట ఇచ్చిందని గుర్తు చేశారు.

ఈ నేపథ్యంలో ఎంతోమంది మేధావులు, రాజకీయ నాయకులు, రైతు సంఘాల నాయకులు, అధికారులతో తో చర్చించి మెరుగైన ఆర్ఓఆర్ చట్టాన్ని రూపొం




దించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారని తెలిపారు. వారి సూచనలు, సలహాలు మేరకు భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి భారతి చట్టాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని వివరించారు. ఈ చట్టం ద్వారా పేరుకుపోయిన భూ సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని అన్నారు. భూభారతి చట్టంలో అప్పీలు వ్యవస్థ ఉండడం ద్వారా రైతులు అన్ని స్థాయిల్లో ఉన్న అధికారులకు అప్పీలు చేసుకోవచ్చని అన్నారు. కోర్టుల చుట్టూ తిరగాల్సిన పనిలేదని చెప్పారు. వారసత్వ భూముల మ్యూటేషన్ కు ఈ చట్టంలో సత్వర పరిష్కారం లభిస్తుందని అన్నారు. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.72 వేల కోట్ల రుణమాఫీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తమ ప్రభుత్వం సుమారు రూ.21 వేల కోట్ల రైతు రుణమాఫీ చేసి, దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం వరి వేయొద్దని హెచ్చరిస్తే తమ ప్రభుత్వం వరిని ప్రోత్సహించడంతోపాటు సన్న వడ్లను పండించే రైతుకు క్వింటాలకు రూ.500 బోనస్ కూడా ఇస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. చొప్పదండి నియోజకవర్గం పరిధిలోని బోయిన్ పల్లి కుడి, కాల్వ ఎడమ కాలువలో నీటిపారుదల వ్యవస్థకు కృత నిశ్చయంతో ఉన్నామని తెలిపారు. నారాయణపూర్ జలాశయ పరిధిలో భూమి కోల్పోయిన వారికి త్వరలో నష్టపరిహారం జమ అవుతుందని అన్నారు. ప్రజల, రైతుల సంక్షేమ తమ ప్రభుత్వ ధ్యేయంగా చెప్పారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ధరణిలోని పొరపాట్లని సవరించేందుకు కలెక్టర్ కి మినహా ఏ అధికారికీ అవకాశం లేదని చెప్పారు. దీనివల్ల తాసిల్దార్ స్థాయిలో పరిష్కారమయ్యే చిన్న సమస్యలు కూడా వేల సంఖ్యలో పేరుకుపోయేవని అన్నారు. తాను నిధుల్లో చేరేటప్పుడు 11 వేల భూ సమస్యల దరఖాస్తులు పెండింగ్లో ఉండేవని అన్నారు. చిన్న చిన్న సమస్యలు కూడా తహసిల్దార్లు, ఆర్డీవోలు పరిష్కరించలేని పరిస్థితి ఉండేదని పేర్కొన్నారు. ఆరు నెలల క్రితం ప్రభుత్వం అధికారాలను విభజించడం వల్ల ప్రస్తుతం 2300 దరఖాస్తులు మాత్రమే పెండింగ్లో ఉన్నాయని, వీటిని కూడా త్వరలోనే పరిష్కరిస్తామని అన్నారు. భూభారతి చట్టం ద్వారా ప్రభుత్వం భూ సమస్యలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చిందని తెలిపారు. ఈ చట్టం ద్వారా పొరపాట్ల సవరణకు అవకాశం ఉందని, మ్యూటేషన్ దరఖాస్తులు త్వరితగతిన పరిష్కారం అవుతాయని తెలిపారు. పెండింగ్లో ఉన్న సాదా బైనమా దరఖాస్తులకు కూడా మోక్షం కలగనుందని అన్నారు. రెండింతల అప్పిలు వ్యవస్థతో రైతులు, ప్రజలు భూ సమస్యలపై కోర్టు వరకు వెళ్లవలసిన అవసరం దాదాపు ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్, ఆర్డీవో మహేశ్వర్,తహసిల్దార్ అనుపమ, ఎంపీడీవో రాము పాల్గొన్నారు.

# సిపిఎం పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా

### స్థానికంగా నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**మంచినీరు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, సమస్యల పై కమిషనర్ కు మెమొరండం**

**వరంగల్, మహా:** గ్రేటర్ వరంగల్ నగరంలో డివిజన్ల వారీగా నెలకొన్న స్థానిక సమస్యలు మంచినీరు, రోడ్లు, డ్రైనేజీ,ఇండ్ల స్థలాలు మొదలగు సమస్యలు వేంటనే పరిష్కరించాలని సిపిఎం పార్టీ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి సిహెచ్ రంగయ్య మాట్లాడుతూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 1 నుండి 20వ తారీకు వరకు వరంగల్ నగరంలో సిపిఎం పార్టీ స్థానిక సమస్యలపై సర్వేలు నిర్వహించడం జరిగిందని, ఈ సందర్భంగా అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. ముఖ్యంగా నగర వ్యాప్తంగా మంచినీటి సమస్య విపరీతంగా ఉందన్నారు. కొన్ని ప్రాంతాలలో నాలుగైదు రోజులకు ఒకసారి మాత్రమే మంచినీటి సరఫరా జరుగుతుందని, పోచమ్మ మైదాన్ నుండి దేశాయిపేట వెళ్ళు రోడ్డు మీద పదే పదే మంచినీటి మెయిన్ పైప్ లైన్ పగిలి లీకేజీల తో రోడ్డు అస్తవ్యస్తంగా మారిందని, కాశిబుగ్గ ప్రాంతంతో పాటు గ్రేటర్ నగరంలోని కొన్ని ప్రాంతాల్లో అయితే పైపులైన్లు పాడైపోయి లీకేజీలు అయ్యి నీరు వృధాగా పోతుందని దీంతో ప్రజలు మంచినీటికి తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అంతేకాకుండా శివనగర్ లో అండర్ డ్రైనేజీ నిర్మాణం గత మూడు సంవత్సరాలుగా తాబేలు నడక వలే పనులు కొనసాగు తున్నాయని




ఆ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అన్నారు. ముఖ్యంగా రామన్నపేట, ఓఎస్ నగరంలో కాశిబుగ్గ ఎం.హెచ్ కాలనీలో ఇంటి నంబర్లు హోల్డర్ల పేరుతోటి కాకుండా ఇంటి యజమాని పేరుతో ఇవ్వాలని అన్నారు. నాణ్యతతో కూడిన సీ సీ రోడ్లు, అంతర్గత డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేని పక్షంలో భవిష్యత్తులో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సింగారపు బాబు మాట్లాడుతూ 29వ డివిజన్ పెద్ద మోరి నాలా పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. రఘునాథ్ నగర్ లో నూతన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను ప్రారంభించాలని పోతన నగర్ రోడ్ లో గుంతలు గుంతలు గా మారిన రోడ్లను పునః నిర్మించాలని కోరారు. నగరంలో దోమల బెడద ఎక్కువై ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని అన్ని ప్రాంతాలలో దోమల మందు స్ప్రే చేయించాలని అన్నారు. అలాగే 31వ డివిజన్ మల్లు స్వరాజ్యం నగర్ లో సిసి రోడ్లు వేసి మంచినీటి కనెక్షన్లు ఇచ్చి అక్కడ విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ వేయాలని కోరారు. సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు నలగంటి రత్నమాల మాట్లాడుతూ కిలా వరంగల్ లో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని పడమర కోట చమన్ వరకు రోడ్డు పాడైపోయిందని వెంటనే వాటికి నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ ధర్నాలో జిల్లా కమిటీ సభ్యులు ఎండి బషీర్ అధ్యక్షత వహించగా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఆరూరి కుమార్,వలదాసు దుర్గయ్య, తో పాటు నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రజతోత్సవ భారీ బహిరంగ సభ వేదిక పరిశీలన

### మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

**హన్మకొండ, మహా;** ఈ నెల 27 వ తేదీన జరగబోయే బీఆర్ఎస్ రజతోత్సవ భారీ బహిరంగ సభ వేదిక పనులను, ఏర్పాట్లను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆశీస్సులతో కనివిని రీతిలో భారీ బహిరంగ సభ విజయవంతం కాబోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి దయాకర్ రావు తో పాటు మాజీ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి , మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, తో



పాటు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, తదితరులు ఉన్నారు.

## ఘనంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు

### పాల్గొన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ మహా;** కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన జరుగుతున్నదని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. సోమవారం రాయపర్తి మండలంలోని కొండూరు జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాలలో మ్యాథమెటిక్స్ ల్యాబ్ ను, ఎంపీపీఎస్ కొండూరు పాఠశాలలో ఏI ల్యాబ్ ను కలెక్టర్ ప్రారంభించారు . ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఏటా ప్రభుత్వ విద్యా రంగం సమగ్ర అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు పాఠ్యాంశాలను బట్టిపట్టి నూరు శాతం మార్కులు సాధిస్తే తెలివైన వారు కాదన్నారు. అన్ని రంగాలపై అవగాహన కలిగి ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రస్తుత పరిస్థితులలో విద్యార్థులకు వ్యవసాయ రంగంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలో వరంగల్ జిల్లా అగ్రస్థానంలో నిలిచిందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ



పాఠశాలలో అనుభవం, అంకితభావం, సుశిక్షితులైన ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నట్లు చెప్పారు. అంతేగాక సర్కార్ బడుల్లో చదువుకుంటున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం ఉచితంగా అందజేస్తున్నట్లు వివరించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ జ్ఞానేశ్వర్, ఎం ఈ ఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కొనతం పద్మలత, తాసిల్దార్ ముల్కనూరి శ్రీనివాస్, ఎంపీడీవో గుగులోతు కిషన్ నాయక్, ఎంపీఓ కూచన ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు

## గుణాత్మక మార్పు దిశగా మోడీ పాలన

### వక్ఫ్ సవరణ బిల్లుపై జరుగుతున్నది తప్పుడు ప్రచారం

### అల్లర్లకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.. మెదక్ ఎంపీ రఘునందన్ రావు

**మహా :** దేశంలో గుణాత్మకమైన మార్పులకు ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారని, సంచలనాత్మక బిల్లులు తెస్తూ ప్రజలకు న్యాయం చేయాలన్నదే కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వ ఉద్దేశమని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మాజీ ఎంపీ బీబీ పాటిల్, జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డిలతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వక్ఫ్ సవరణ చట్టంపై పేద ముస్లింలలో అపోహలు సృష్టిస్తూ అల్లర్లు రేపే ప్రయత్నాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఈ చట్టం ద్వారా వక్ఫ్ పేరిట భూములు అక్రమంగా తీసుకోవడం ఆగిపోతుందని స్పష్టం చేశారు. జహీరాబాద్ నియోజకవర్గంలో మొత్తం 12,892 ఎకరాలు వక్ఫ్ భూములుగా నమోదు చేయడం వల్ల వేల మంది రైతులు వారి హక్కులు కోల్పోయారని తెలిపారు. కొండాపూర్ మండలం సైదాపూర్ లో 197 ఎకరాలు వక్ఫ్ జాబితాలో చేరడం వల్ల సుమారు 200 మంది రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. మొగుడంపల్లి, కోహీర్, ఝరాసంగం, న్యాల్కల్, రాయికోడ్ మండలాల్లో పెద్ద ఎత్తున భూములు



వక్ఫ్ జాబితాలో చేరాయని ఆరోపించారు. రాష్ట్రంలో పాతబస్తీ వక్ఫ్ ఆస్తులపై సీఎం రేవంత్ రెడ్డి బహిరంగంగా వివరాలు ఇవ్వాలనీ, ముతావలీలు ఎవరి పేర్లపై లీజులకు ఇచ్చారో వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. పట్టణాల్లో వక్ఫ్ భూములు ఆక్రమణకు గురవుతున్నా, అసలు లబ్ధిదారులైన పేద ముస్లింలకు ఉపయోగం లేకుండా పోతోందని తప్పుడు ప్రచారాలు నమ్మొద్దని రైతులు, ప్రజలు వాక్ఫ్ చట్టంపై అవగాహన పెంచుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మౌనాన్ని ప్రజలు గమనిస్తున్నారని రఘునందన్ రావు అన్నారు.

## శ్రీ గోవిందరాజస్వామి దేవస్థానంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవాలు

### 2వ రోజు ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు

**వరంగల్ మహా;** ఓరుగల్లు నగరంలో ప్రముఖ ప్రసిద్ధిగాంచిన శ్రీశ్రీశ్రీ గోవిందరాజస్వామి దేవస్థానంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం రెండవ రోజు వాస్తు పురుష పూజ, అష్టదిక్పాలక పూజ ,వాస్తు హోమము, పరియగ్నికరణము జరిపి దేవస్థాన శుద్ధి ,ధ్వజస్తంభ శుద్ధి పూజలు గావించి, పురుష ఉపచార పూజ నిర్వహించి జలదివాసము , పత్ర పుష్పార్చన చేశారు. ఈ కార్యక్రమాన్ని అజాజమా జీయర్ మఠం(తల్లూరు మఠం) మఠాధిపతి శ్రీశ్రీశ్రీ పాదుగు ప్రసాదాచార్యులు స్వామివారి ఆధ్వర్యంలో శ్రీమ: జగన్నాథ వేద పాఠశాల స్థాపకులు శ్రీ జగన్నాథం విష్ణు వర్ధకాచార్యులు, శిష్యులు నిర్వహించారు. అనంతరం కార్పొరేటర్ చింతాకుల అనిల్ మాట్లాడుతూ ధ్వజస్తంభ ప్రతిష్టాపన లో భాగంగా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నామని ఈ



ధ్వజస్తంభ ప్రతిష్టాపన ప్రతిష్టాత్మకంగా బుధవారం నాడు 10:45 నిమిషాలకు జరుగుతుందని ప్రజలందరూ పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అర్చకులు వేణుమాధవస్వామి, వేణుస్వామి, శ్రీకాంత్ స్వామి, కిరణ్ స్వామి, అరుణ్ స్వామి, స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్, సునీల్ ,మనోహర్, బాషాపక సదానందం, కొమ్ము రాజకుమార్, సత్యనారాయణ, పద్మ, శ్రీను, రాధాకృష్ణ , పురజనులు, మహిళలు, అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అత్యంత ప్రతిష్టాత్మకంగా సరస్వతీ నది పుష్కరాల నిర్వహణ

### సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**కాటారం, మహా :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాలేశ్వరం పుణ్యక్షేత్రంలో మే నెల 15 నుండి 26వ తేదీ వరకు జరిగే సరస్వతి నది పుష్కరాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సరస్వతి పుష్కరాలు మన జిల్లాలో జరిగే అత్యంత ప్రతిష్ఠాత్మక పుష్కరాలు కావడంతో, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి షెడ్యూల్ ప్రకారం పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, దేవాదాయ శాఖ, ఆర్టీసీ వంటి వివిధ శాఖల అధికారులతో పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంజినీరింగ్ శాఖల అధికారులు ఇప్పటికే పనుల షెడ్యూల్ ఇచ్చినట్లు తెలిపారు. ఆ షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్దేశిత అన్ని పనులు చేపట్టాలని సూచించారు. అన్ని శాఖల సమన్వయంతో పుష్కర ఏర్పాట్లు విజయవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. గోదావరి నదిలో నీటి సామర్థ్యం నిశితంగా గమనిస్తూ ఉండాలని తెలిపారు. గడిచిన 21 రోజుల నుండి నీటి సామర్థ్యాన్ని పరిశీలిస్తున్నామని, 13 సెంటి మీటర్లు నీరు తగ్గినట్లు తెలిపారు. గత మే నెలలో గోదావరి నీటి మట్టం 94 మీటర్ల 540 సెంటి మీటర్లు ఉన్నట్లు తెలిపారు. నీటి సామర్థ్యాన్ని పర్యవేక్షణ చేస్తుండాలని ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదికలు పంపాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్, డిపిఓ నారాయణరావు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, విద్యుత్ శాఖ ఎస్ ఈ మల్హార్ నాయక్, పీఆర్ ఈ ఈ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఈఈ తిరుపతి, దేవస్థాన కార్యనిర్వాహణాధికారి మహేష్, దేవస్థానం డిఈ పాల్గొన్నారు.



## కాంగ్రెస్ మంత్రులతో పాయల్ శంకర్ దోస్తీ

### తను కాంగ్రెస్ ఎమ్మెల్యేనే అనుకోండని వారితో వెల్లడి

- తన భూకబ్జాలు బయట పడకుండా జాగ్రత్త
- ఇలాంటి భూ మాఫియాదారున్ని కాంగ్రెస్ పార్టీ క్షమించదు
- ఇప్పటికే మంత్రులకు చేరిన పాయల్ కబ్జాల చిట్టా
- విచారణ జరిపిస్తే పాయల్ రాజకీయ భవిష్యత్తు గందరగోళం
- భూభారతి సదస్సు సక్సెస్ పట్ల హర్షం
- విచ్చేసిన మంత్రులు, అధికారులు, రైతులు, ప్రజలకు, నాయకులకు అభిమానులకు ప్రత్యేక ధన్యవాదాలు: ప్రెస్ మీట్ లో కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ లో భూకబ్జాలకు పాల్పడుతూ స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ ల్యాండ్ మాఫియాను పెంచి పోషిస్తున్నాడని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆరోపించారు.సోమవారం తన క్యాంపు కార్యాలయం లో మీడియా సమావేశం లో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పై నిప్పులు చెరిగారు.ప్రభుత్వ అసైన్డ్ భూములు కబ్జా చేస్తూ పేదల నోట్లో మట్టికొడుతున్నాడని మండి పడ్డారు. అంతే కాకుండా తన అక్రమాలకు అడ్డు వచ్చేవారిపై , అన్యాయాన్ని ప్రశ్నించే వారిపై భౌతిక దాడులు కూడా చేయించారని ఆరోపించారు. అతని ఆర్థిక రాజకీయ ఎదగుదలకోసం ఎవరి జీవితాన్నైనా ఫణంగా పెట్టడానికి సిద్దంగా ఉంటారన్నారు. చివరికి ఏమీ తెలియని ఆవేశ పరుడైన తన కుమారుడి ని కూడా ఉసిగొల్పి దాడులకు ప్రేరేపిస్తారని అన్నారు. ఎక్కడ తన అవినీతి అక్రమాల బాగోతం బయట పడుతుందోనన్న భయంతో కాంగ్రెస్ ప్రభుత్వంలోని మంత్రులతో అంటకాగుతున్నారని విమర్శించారు.తనను కాంగ్రెస్ ఎమ్మెల్యేనే అనుకోని వ్యవహరించండని నిస్సిగ్గుగా వారితో మాట్లాడారని స్వయానా ఒకరిద్దరు మంత్రులే ఈ విషయాన్ని చెప్పినట్టు వివరించారు. తను చెబుతున్నది నిజమని తడి బట్టలతో ఆలయంలో ప్రమాణం చేస్తానని మరి కాదు అబద్దమని ఆయన ప్రమాణం చేస్తరా అని సవాల్ విసిరారు. తన సవాల్ కి రేపటి లోగా ప్రతి స్పందించాలని మరో మారు సవాల్ చేసారుఇలాంటి భూకబ్జాకోరు కాంగ్రెస్ పార్టీ ఎప్పటికి క్షమించదన్నారు.ఇక అనంతరం ఇటీవల భూభారతి సదస్సులో పాల్గొన్నందుకు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ,ఇంచార్జి మంత్రి సీతక్కలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమం సూపర్ సక్సెస్ అయిందని పాల్గొని విజయవంతం చేసిన నాయలకులకు అధికారులకు రైతులకు ప్రజలకు తన అభిమానులకు కృతజ్ఞతలు తెలియ చేసారు. ఆదిలాబాద్ జిల్లాలో కొత్త మండలమైన భోరజ్ ను పైలెట్ ప్రాజెక్టుగా కింద తీసుకొని ఇక్కడికి రావడం హర్షనీయమన్నారు. మా జిల్లాను సందర్శించాలన్న తన కోరికను మన్నించి వచ్చిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి మరోమారు ధన్యవాదాలుతెలిపారు. భూభారతి రైతుల సమస్యల పరిష్కారానికి ఒక చక్కటి వేదిక అని తెలిపారు. గత బీఆర్ఎస్ పాలలో ధరణి వల్ల రైతులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. అనేక మంది తమ భూములు కోల్పోయారన్నారు .ఆడపిల్ల పెళ్లి చేయడానికి భూములమ్మాలన్నా ధరణి లో కష్టమైందన్నారు .కాని భూభారతి ఒక వందేళ్ళపాటు నిలిచిపోయే చారిత్రాత్మక ప్రాజెక్టు అన్నారు.సీయం రేవంత్ రెడ్డి ధరణిని బంగాళాఖాతంలో కలిపేస్తానన్న తన మాటను నెరవేర్చుకున్నారన్నారు. భూభారతి చట్టాన్ని పేదల కోసం తీసుకొచ్చారన్నారు .ఇక ప్రభుత్వం అత్యంత ప్రతిష్టా



త్మక చేపట్టిన సన్న బియ్యం పథకాన్ని కూడా ప్రజలు ఆదరిస్తున్నారన్నారు.సన్నబియ్యం పంపిణి పట్ల పేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. సన్న బియ్యం లబ్ధిదారుల ఇంట్లో భోజనం కూడా చేయడం జరిగిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి సన్న బియ్యం లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలుపుతున్నారన్నారు. ఇలాంటి ప్రభుత్వం నడుపుతన్నపార్టీలో ఉండడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అనేక సంక్షేమ పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల వద్దకు తీసుకు వచ్చిందన్నారు. 22 వేల కోట్ల రైతు రుణాలు మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వందే అన్నారు .ఆర్థిక లోటును భర్తీ చేయడానికి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలో వేల కోట్ల పెట్టుబడులు తీసుకొస్తున్నారన్నారు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం మంచి ప్రజాపాలన సాగిస్తుందన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద నిరుద్యోగ యువతకు మంచి ఉపాధి కల్పిస్తున్నారని వివరించారు. అదిలాబాదుకు ఏయిర్ పోర్ట్ తీసుకొస్తానని సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు ఆదిలాబాద్ ప్రజలందరి తరపున తరపున రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. ఆదిలాబాద్ పట్టణానికి వేసవిలో తాగునీటి ఎద్దడిని తీర్చడం కోసం లాండసాంగ్వి పంప్ హౌజ్ మరమ్మత్తుల కోసం నిధులు కేటాయించారన్నారు. అంతేకాక చెక్ డ్యాముల నిర్మాణం కోసం 40 కోట్ల ప్రతిపాదనలని రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తున్నామని తెలిపారు. ఇలాంటి సంక్షేమ పథకాలను కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి,కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గుడిపల్లి నగేష్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని,తాజా మాజీ కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్,బండారి సతీష్,సంద నర్సింగ్,యెల్మెల్వార్ రామ్ కుమార్,ఆవుల వెంకన్న,షేక్ ఇమ్రాన్, జాఫర్ అహ్మద్,నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి, బూర్ల శంకరయ్య, దాసరి ఆశన్న,మునిగేల విట్టల్,ఎం. ఏ షకీల్,ఎం.ఏ కయ్యుమ్,యెల్టీ భోజా రెడ్డి,సుధాకర్ గౌడ్,అశోక్,సాహెబ్ రావు,చంద్రకాంత్ రెడ్డి,సాహెబ్రావు,ముక్కెర సంతోష్,ప్రభాకర్,ఎల్మ రామ్ రెడ్డి, మినుకు నారాయణ్ రెడ్డి,నిమ్మల ప్రభాకర్, పట్టేపు వసంత్,తానాజీ, పెందూర్ మోహన్, మోసిన్,నిమ్మల గౌతమ్ రెడ్డి,చంటి తదితరులు పాల్గొన్నారు.



### పోప్ ఫ్రాన్సిస్ కంది శ్రీనివాస రెడ్డి ఘన నివాళి


#### ప్రజా సేవాభవన్ లో సంతాప సభ

**ఆదిలాబాద్:** పోప్ ఫ్రాన్సిస్ మరణం ప్రపంచ క్రైస్తవులందరికి జీర్ణించుకోలేని వార్త అని నేడు వారందరికి దుర్దినమని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆయన మృతిపట్ల సంతాపం వ్యక్తం చేస్తూ ఆదిలాబాద్ పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో సంతాప సభను ఏర్పాటు ఏసారు. కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పోప్ చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించి నివాళ్లు అర్పించారు. పోప్ గా 2013 నుండి 2025 వరకు మొత్తం 12 సంవత్సరాలు ఆయన సేవ చేసారని తెలిపారు. పోప్ ఫ్రాన్సిస్ తన పాపసీ సమయంలో అనేక ప్రగతిశీల మార్పులను తీసుకువచ్చారన్నారు. సామాజిక న్యాయం, పేదల పట్ల మానవతా దృక్పథంతో సేవలు అందించిన గొప్ప వ్యక్తి అన్నారు. అంతేకాకుండా పత్రికల ద్వారా పర్యావరణ పరిరక్షణకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారన్నారు.లింగ సమానత్వమును గౌరవిస్తూ చర్చిలో మహిళల పాత్రను ప్రోత్సహించారని కొనియాడారు. ఈసంతాప సభలో ఈ కార్యక్రమం లో జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి,కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గుడిపల్లి నగేష్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని,తాజా మాజీ కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్,బండారి సతీష్,సంద నర్సింగ్,యెల్మెల్వార్ రామ్ కుమార్,ఆవుల వెంకన్న,షేక్ ఇమ్రాన్,జాఫర్ అహ్మద్,నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి, బూర్ల శంకరయ్య, దాసరి ఆశన్న,మునిగేల విట్టల్,ఎం. ఏ షకీల్,ఎం.ఏ కయ్యుమ్,యెల్టీ భోజా రెడ్డి,సుధాకర్ గౌడ్,అశోక్,సాహెబ్ రావు,చంద్రకాంత్ రెడ్డి,సాహెబ్రావు,ముక్కెర సంతోష్, ప్రభాకర్,ఎల్మ రామ్ రెడ్డి,మినుకు నారాయణ్ రెడ్డి,నిమ్మల ప్రభాకర్, పట్టేపు వసంత్,తానాజీ, పెందూర్ మోహన్, మోసిన్,నిమ్మల గౌతమ్ రెడ్డి,చంటి తదితరులు పాల్గొన్నారు.

## 8వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

### మండుటెండను లెక్కచేయకుండా దీక్షలో పాల్గొన్న జర్నలిస్ట్ లు .. సంఘీభావం తెలిపిన టిడిపి సీనియర్ నాయకులు

**వరంగల్, మహా;** ప్రభుత్వాలు మారిన పాలకులు మారిన ఫలితమేముందని ప్రజా సంఘాలు, ప్రజల తో పాటు పార్టీలకతీతంగా నాయకులు ప్రశ్నిస్తున్నారు. కలం గళం కార్మికులుగా ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేసి తమ కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తించే జర్నలిస్టులకే ప్రభుత్వం, పాలకులు న్యాయం చేయలేక పోతే ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. గూడు కోసం మండు టెండలను సైతం లెక్కచేయకుండా తమ ప్రాణాలను పణంగా పెట్టి వరంగల్ తూర్పు వర్కింగ్ జర్నలిస్టులు నిబద్దతతో చేస్తున్న రిలే నిరాహార దీక్ష ఏడవ రోజుకు చేరింది. సోమవారం డబల్ బెడ్ రూమ్ ఇండ్ల సాధనకై వరంగల్ తూర్పు జర్నలిస్టులు చేపట్టిన నిరహార దీక్ష కు టీడీపీ పార్టీ తెలంగాణ రాష్ట్ర సెక్రెటరీ చిలువేరు రవీందర్, సీనియర్ నాయకులు సిరబోయిన రాజు, అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ,బొమ్మల కట్టయ్య కుమారుడు అంబేద్కర్ లు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇకనైనా పాలకులు కండ్లు తెరిచి జర్నలిస్టుల హక్కులను కాల రాయకుండా వారి న్యాయమైన ఆకాంక్ష డబల్ బెడ్ రూమ్ ఇండ్లను వర్కింగ్ జర్నలిస్టులకు మంజూరు చేయాలని కోరారు.



## క్రీడలు మానసిక వికాసానికి దోహదం చేస్తాయి

**తొర్రూర్ మహా:** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండల కేంద్రంలోని జడ్.పి.హెచ్.ఎస్ హైస్కూల్లో నిర్వహించిన వాలీబాల్ క్రీడల బహుమతి ప్రధానోత్సవాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడలు మనో వికాసానికి దోహదం చేసి శారీరక దృఢత్వానికి తోడ్పడుతాయని తొర్రూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతి రెడ్డి అన్నారు తొర్రూర్ ఉన్నత పాఠశాలలో గత రెండు రోజులుగా నిర్వహించబడిన కీ.శే అనుమాండ్ల మాధవ రెడ్డి గారి జ్ఞాపకార్థం వారి మనవడైన అనుమాండ్ల తిరుపతి రెడ్డి ఆర్థిక సౌజన్యంతో నిర్వహించబడిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఆహ్వానిత వాలీబాల్ క్రీడోత్సవాల బహుమతి ప్రధానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ క్రీడలు స్నేహాన్ని పెంపొందిస్తాయని శారీరక మనో వికాసాన్ని కలిగిస్తాయని అందుకే విద్యార్థులందరూ కూడా క్రీడల పైన దృష్టి పెట్టాలని అన్నారు. నేడు అంతర్జాల ప్రభావం వల్ల మైదాన క్రీడలు కనుమరుగు అతున్నాయన్నారు.వాటి బారి నుండి రక్షించి నేడు క్రీడల్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ క్రీడల ప్రారంభోత్సవానికి స్థానిక శాసనసభ్యులు మామిడాల యశస్విని రెడ్డి ఝాన్సీ రెడ్డి హాజరుకాగా, ఎంప్లాయిస్ వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు గొడిశాల నగేష్ అధ్యక్షతన జరిగిన ముగింపు సమావేశానికి బహుమతి ప్రధానోత్సవాలకి ముఖ్య అతిథిగా తిరుపతి రెడ్డి హాజరై క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతి ప్రధానం చేయడం జరిగింది. ప్రథమ బహుమతిని రఘునాథపల్లి క్రీడాకారులు ద్వితీయ బహుమతిని మేడారం క్రీడాకారులు తృతీయ బహుమతిని కొత్తగూడ క్రీడాకారులు చతుర్ద బహుమతిని తాడ్వాయి క్రీడాకారులు గెలుచుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రెటరీ వాసిరెడ్డి ప్రవీణ్ రెడ్డి సూరం ఉపేందర్ రెడ్డి తొర్రూర్ మండల ఎంఈఓ బుచ్చయ్య తోరూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జెల్ల లక్ష్మీనారాయణ వాలీబాల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మర్మాల ఆది రెడ్డి, నరెడ్ల శ్రీధర్ ఎంప్లాయిస్ వాలీబాల్ అసోసియేషన్ తొర్రూర్ ప్రతినిధులు కొండం జనార్ధన్ దేవులపల్లి శంకర్ కారంపూడి సురేష్ పాల్గొన్నారు



## ఐదో సెషన్‌లోనూ లాభాలే..



బ్యాంకింగ్, ఐటీ, ఆటో రంగాల్లో భారీ కొనుగోళ్లతో బెంచ్ మార్క్ ఇండియన్ ఈక్విటీ సూచీలు వరుసగా ఐదో ట్రేడింగ్ సెషన్ లోనూ లాభాల్లో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 855.30 పాయింట్లు లేదా 1.09 శాతం పెరిగి 79,408.50 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ కూడా 273.90 పాయింట్లు లేదా 1.15 శాతం పెరిగి 24,125.55 వద్ద ముగిసింది. టెక్ మహీంద్రా, ఇండస్ఇండ్ బ్యాంక్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, బజాజ్ ఫిన్‌సర్వ్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు 4.91 శాతం వరకు లాభపడటంతో సెన్సెక్స్‌లోని 30 షేర్లలో 23 షేర్లు లాభాల్లో ముగిశాయి. మరోవైపు నిఫ్టీ మిడ్ క్యాప్ 100, నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 వరుసగా 2.50 శాతం, 2.21 శాతం లాభాలతో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ వరుసగా ఐదు ట్రేడింగ్ సెషన్లలో 7.5 శాతం లేదా 5,562 పాయింట్లు లాభపడగా ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 ఇండెక్స్ 7.7 శాతం లేదా 1,726 పాయింట్లు పెరిగింది.

### స్టిక్కర్లు లేకుంటే..

## రూ. 5వేల జరిమానా

ఢిల్లీ మోటార్ వాహన చట్టంలోని నిబంధనల ప్రకారం.. ఇంధన రకాన్ని సూచించే కలర్ కోడెడ్ స్టిక్కర్లను తప్పకుండా అంటించాలి. ఈ నియమాన్ని అతిక్రమించిన వాహనాలపైన కఠినమైన చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ వెల్లడించింది. నిబంధనలు పాటించకపోతే మోటారు వాహన చట్టం కింద రూ. 5000 జరిమానా విధిస్తారు. ఈ స్టిక్కర్లు 201213లో ప్రవేశపెట్టబడిన హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్స్ (HSRP) లో భాగంగా తీసుకొచ్చారు. ఆ తరువాత 2019 నాటికి అన్ని వాహనాలను ఈ స్టిక్కర్లు తప్పనిసరి అంటూ ఢిల్లీ రవాణా శాఖ ఆదేశాలు జారీ చేసింది. వాహనాలకు కలర్ కోడెడ్ స్టిక్కర్లను అతికించని వాహనదారులు జరిమానా చెల్లించడం మాత్రమే కాకుండా.. పొల్యూషన్ సర్టిఫికెట్ (PUCC) కూడా పొందలేరు. నిబంధనల ప్రకారం, డీజిల్ వాహనాలకు నారింజ రంగు స్టిక్కర్లు, పెట్రోల్ & సీఎన్జీ వాహనాలకు లేత నీలం రంగు స్టిక్కర్లు.. మిగిలిన అన్ని వాహనాలకు బూడిద రంగు స్టిక్కర్లు తప్పనిసరిగా అతికించాలి.

# ఈ ఇల్లుతో చిక్కే



మన కలల సౌధం పది కాలాల పాటు దృఢంగా ఉండాలంటే భవన నిర్మాణం సమయంలో తడిగా ఉండే ప్రదేశాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. మరుగుదొడ్లు, స్నానాల గదులు, కిచెన్ సింక్, వాషింగ్ మిషన్ ఉండే చోట నిర్మాణం సమయంలోనే నాణ్యత పాటించేలా చూసుకోవడం కూడా అవసరం. ముఖ్యంగా మరుగుదొడ్లు, స్నానాల గదుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఆ తర్వాత ఎదురయ్యే పరిణామాలు తలనొప్పిగా మారుతుంటాయి. పైకి ఆకట్టుకునేలా ఉండటమే కాకుండా ఎంత క్వాలిటీ వస్తువులు వాడారు.. ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు అనే విషయాలు తెలుసుకోవాలి.

**అప్రమత్తత అవసరం..**

వాటర్ ప్రూఫింగ్ సక్రమంగా లేకుంటే టైల్స్‌పై నిలిచిన నీటి నుంచి సన్నగా లీకేజీ ప్రారంభమవుతుంది. ఇందుకు వ్యక్తిగత గృహాలు, విల్లాలు ఏవీ మినహాయింపు కాదు. లీకేజీకి ఎక్కడైనా అవకాశం ఉంటుంది. నిర్మాణం పూర్తయిన సంవత్సరం.. ఆ తర్వాత ఈ సమస్య బయట పడుతుంది. గోడలకు చెమ్మ రావడం, వాసన వస్తుండటం వంటి సంకేతాలు కనిపిస్తుంటాయి. వెంటనే అప్రమత్తం కాకపోతే సమస్య క్రమంగా భవనమంతా వ్యాపిస్తుంది. అదే అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీ బహుళ అంతస్తుల భవనాల్లో మన ఫ్లాట్ కింద ఉన్న వారికి సమస్యలు మొదలవుతాయి. గోడలకు చెమ్మ రావడం, రంగు మారిపోవడం, పెచ్చులుగా రంగు ఊడిపోతుండడం, దుర్వాసన వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. సమస్య తమ ఫ్లాట్‌లోనే ఉందని తొలుత అంతా భావిస్తారు. భవన నిర్మాణదారుడు సరైన వాటర్ ప్రూఫింగ్ విధానం పాటించకపోవడంతో పైఫ్లాట్ నుంచి లీకేజీ అవుతున్నట్లు ఆలస్యంగా గ్రహిస్తారు. వీటిని ప్లంబర్లు, నిర్మాణ మేస్త్రీలు మాత్రమే కచ్చితంగా గుర్తిస్తారు.

### టాయిలెట్ రూమ్ నుంచే లీకేజీ సమస్య మొదలు



సాధారణంగా అత్యధిక లీకేజీలు టాయిలెట్ రూమ్ నుంచే మొదలవుతాయి. ఆ ప్రదేశాలలో నీరు నిల్వ ఉండకుండా ఉండేందుకు టైల్స్ ఎగుడుదిగుడుగా లేకుండా చూసుకోవాలి. దీనికంటే ముందు నిర్మాణ దశలోనే కాంక్రీట్ లేదంటే బ్రిక్స్‌తో రసాయనాలు వినియోగించి వాటర్ ప్రూఫ్ బెడ్ ఏర్పాటు చేయాలి. ఇక నీటి పైప్‌లైన్ల కారణంగానూ లీకేజీలు ఏర్పడతాయి. వంట గదిలో సింక్ దగ్గర, వాషింగ్ మిషన్ ప్రదేశాలలో పైపుల దగ్గర జాగ్రత్తగా వ్యవహరించాలి.





## పెరుగుతున్న ఇన్వెస్టర్లు

గత ఆర్థిక సంవత్సరం(2024-25)లో దేశీ క్యాపిటల్ మార్కెట్లు జోరు చూపడం పలువురు ఇన్వెస్టర్లకు జోష్‌నిచ్చింది. దీంతో స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఈలో నికరంగా 84 లక్షల డీమ్యాట్ ఖాతాలు కొత్తగా జమయ్యాయి. వెరసి మొత్తం డీమ్యాట్ ఖాతాల సంఖ్య 4.92 కోట్లను తాకింది. ఇందుకు ప్రధానంగా మార్కెట్లు జోరందుకోవడానికితోడు డిజిటల్ బ్రోకరేజీ సంస్థలు దోహదం చేశాయి. కొత్తగా జత కలిసిన ఖాతాలలో గ్రో, ఏంజెల్ వన్ నుంచే 57 శాతం నమోదయ్యాయి. 34 లక్షల డీమ్యాట్ ఖాతాలు గ్రో నుంచి ఓపెన్‌కాగా.. ఏంజెల్ వన్ నుంచి 14.6 లక్షల ఖాతాలు జమయ్యాయి. అంటే 84 లక్షల కొత్త ఖాతాలలో ఈ రెండు సంస్థల నుంచే 48.6 లక్షల ఖాతాలు జత కలిశాయి. ఈ బాటలో ఇన్వెస్టర్లు మరో బ్రోకింగ్ సంస్థ జిరోధా నుంచి 5.4 లక్షల ఖాతాలు తెరిచినట్లు ఎన్ఎస్ఈ గణాంకాలు మొబైల్ ఆధారిత సరళీకృత లావాదేవీల కారణంగా ఇన్వెస్టర్లు డిజిటల్ బ్రోకరేజీలను ఆశ్రయిస్తున్నట్లు మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు, పట్టణాల నుంచి ఇన్వెస్టర్లు డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా లావాదేవీలకు ఆసక్తి చూపుతున్నట్లు వివరించారు.

## మార్కెట్లోకి నకిలీ రూ.500 నోట్లు

నకిలీ 500 రూపాయల నోట్లు చలామణిలోకి రావడంతో.. హోం మంత్రిత్వ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. టెక్నాలజీ సాయంతో తయారు చేసిన ఈ నకిలీ నోట్లు చూడటానికి నిజమైనవి మాదిరిగా అనిపించడం వల్ల చాలా మంది మోసపోయే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని మంత్రిత్వ శాఖ ప్రజలను హెచ్చరించింది. నకిలీ రూ. 500 నోట్లను గుర్తించడం కొంత కష్టతరంగా ఉండటంతో.. చాలామంది మోసపోతున్నారు. అయితే నిజమైన రూ. 500 నోటుకు, నకిలీ నోటుకు ఓ చిన్న తేడా ఉంది. దీనిని గమనిస్తే.. ఏది నకిలీ నోటు అనేది సులభంగా తెలుసుకోవచ్చు. నకిలీ 500 రూపాయల నోట్లు చలామణిలోకి రావడంతో.. హోం మంత్రిత్వ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. టెక్నాలజీ సాయంతో తయారు చేసిన ఈ నకిలీ నోట్లు చూడటానికి నిజమైనవి మాదిరిగా అనిపించడం వల్ల చాలా మంది మోసపోయే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని మంత్రిత్వ శాఖ ప్రజలను హెచ్చరించింది. నకిలీ రూ. 500 నోట్లను గుర్తించడం కొంత కష్టతరంగా ఉండటంతో.. చాలామంది మోసపోతున్నారు. అయితే నిజమైన రూ. 500 నోటుకు, నకిలీ నోటుకు ఓ చిన్న తేడా ఉంది. దీనిని గమనిస్తే..



ఏది నకిలీ నోటు అనేది సులభంగా తెలుసుకోవచ్చు. ఒరిజినల్ రూ. 500 నోట్ల మీద రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RESERVE BANK OF INDIA) అని అక్షరాలు ఉండటం గమనించే ఉంటారు. అయితే నకిలీ నోటు మీద కూడా RESERVE BANK OF INDIA అని ఉంటుంది. కానీ RESERVE అనే పదంలోని.. చివరి E స్థానంలో A ఉంటుందని అధికారులు వెల్లడించారు. నకిలీ నోట్లు మార్కెట్లోకి రావడంతో.. ప్రజలు, వ్యాపార సంస్థలు అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులు చెబుతున్నారు. నకిలీ నోట్లను గురించకపోతే నష్టపోతారని హెచ్చరించారు. నకిలీ నోట్లను చలామణీ చేసే ముఠాలను పట్టుకోవడానికి, వారిపై చర్యలు తీసుకోవడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.



# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



### నన్ను చంపేందుకు

## కుట్రలు..

**కేంద్రమంత్రి సంచలన ఆరోపణలు**

**ఛండీగఢ్:**

తన హత్యకు ఖలిస్థానీలు కుట్రలు చేస్తున్నారని కేంద్రమంత్రి రవనీత్ సింగ్ బిట్టూ సంచలన ఆరోపణలు చేశారు. రాడికల్ ప్రచారకుడు, ఎంపీ అమృత్‌పాల్ సింగ్ నడిపిస్తున్న 'వారిస్ పంజాబ్ దే' సంస్థతో సంబంధమున్న ఖలిస్థానీ మద్దతుదారులే తన హత్యకు ప్లాన్ చేశారని చెప్పుకొచ్చారు. దీంతో, ఆయన వ్యాఖ్యలు పెను దుమారం రేపుతున్నాయి.

తాజాగా, రైల్వేశాఖ సహాయ మంత్రి రవనీత్ సింగ్ బిట్టు మాట్లాడుతూ.. పంజాబ్‌లోని రాజకీయ నాయకులకు ఖలిస్థానీ మద్దతుదారుల నుంచి ప్రమాదం పొంచి ఉంది. పలువురు నేతల హత్యకు వారు ప్లాన్ చేస్తున్నారు. ఖలిస్తానీల ప్లాన్ గురించి సోషల్ మీడియాలో లీకైన కొన్ని స్క్రీన్ షాట్ల ద్వారా ఈ విషయం నాకు తెలిసింది. ఖలిస్తానీల ప్లాన్ గురించి సోషల్ మీడియాలో లీకైన కొన్ని స్క్రీన్ షాట్ల ద్వారా ఈ విషయం నాకు తెలిసింది. ఖలిస్తానీల ప్లాన్ గురించి సోషల్ మీడియాలో లీకైన కొన్ని స్క్రీన్ షాట్ల ద్వారా ఈ విషయం నాకు తెలిసింది. ఎంపీ అమృత్‌పాల్ సింగ్ నడిపిస్తున్న 'వారిస్ పంజాబ్ దే' సంస్థతో సంబంధమున్న ఖలిస్థానీ మద్దతుదారులే ఇందులో ఉన్నారు. నాతో పాటుగా మరికొంతమంది రాజకీయ నాయకుల ప్రాణాలకు కూడా ఖలిస్థానీయుల నుంచి ముప్పు పొంచి ఉంది' అంటూ వ్యాఖ్యలు చేశారు.







## భయం గుప్పిట్లో


# పన్నెండేండ్లు

### స్కిజోఫ్రెనియా

**ఈ సమస్యతో బాధపడేవారు ఎప్పుడూ ఒక రకమైన భ్రమలో ఉంటారు. లేనిపోనివి ఊహించుకుని భయపడిపోతుంటారు. మనస్సులో ఏదో ఊహించుకుంటూ నిరంతరం ఆందోళన చెందుతూ ఉంటారు. ఇలాంటి వ్యక్తులు వాస్తవానికి దూరంగా ఊహల్లో ఉంటారు. తమలో తాము మాట్లాడుకోవడం, నవ్వుకోవడం, ఇతరులను పట్టించుకోకుండా తన మానాన తానుండటం, నిరంతర ఆలోచనలు, నిద్రలేమి, ఎవరో పిలుస్తున్నట్టుగా, తనతో మాట్లాడుతున్నట్టుగా భావించి సమాధానం ఇవ్వడంలాంటివి వ్యాధి లక్షణాలు. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సైకియాట్రిస్టును సంప్రదించాల్సి ఉంటుంది.**

**బెంగళూరు:**


కర్ణాటక మాజీ డీజీపీ ఓం ప్రకాశ్ తనయుడు కార్తీక్ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. ఓం ప్రకాశ్ భార్య పల్లవి, కూతురు క్రుతిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గత 12 ఏళ్లుగా స్కిజోఫ్రెనియా(Schizophrenia)తో బాధపడుతోంది. నగరంలోని ఓ ప్రముఖ వైద్యుడి దగ్గర ఆమె చికిత్స కూడా తీసుకుంటోంది. ఈ క్రమంలో గత కొంతకాలంగా భర్తపైనా ఆమె సంచలన ఆరోపణలు చేస్తూ వస్తోంది. తన ప్రాణాలకు తన భర్త నుంచి ముప్పు పొంచి ఉందని.. తుపాకీతో పలు మార్లు బెదిరించడాన్ని ఫ్యామిలీకి చెందిన ఐపీఎస్ ఫ్యామిలీ వాట్సాప్ గ్రూపులో మెసేజ్‌లు పెడుతూ వచ్చింది. అయితే ఆమె మానసిక స్థితి గురించి తెలిసిన ఓం ప్రకాశ్.. ఆ చేష్టలను తేలికగా తీసుకుంటూ వచ్చారు. ఈ క్రమంలో.. ఈ మధ్య ఆస్తి తగాదాలు మొదలయ్యాయి. ఈ కారణాలతోనే ఆమె భర్తను హత్య చేసి ఉంటుందని పోలీసులు ప్రాథమికంగా ఓ అంచనాకి వచ్చినట్లు ఇండియా టుడే ఓ కథనం ప్రచురించింది. ఆదివారం సాయంత్రం నుంచి పల్లవి(Pallavi)ని, క్రుతిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అయితే పోస్టుమార్టం నివేదిక వచ్చాకే ఈ కేసులో అరెస్టులు చేస్తామని బెంగళూరు కమిషనర్ బీ దయానంద్ చెబుతున్నారు. ఈ ఘటనను దురదృష్టకరమైందిగా అభివర్ణించిన హోం మంత్రి పరమేశ్వర.. ఓం ప్రకాశ్‌తో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని, ఈ కేసులో సమగ్ర దర్యాప్తు జరుగుతుందని పేర్కొన్నారు.




1981 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన ఓం ప్రకాశ్ స్వస్థలం బిహార్‌లోని చంపారన్. 2015 మార్చి 1న కర్ణాటక డీజీపీగా బాధ్యతలు చేపట్టి, 2017లో పదవీ విరమణ పొందారు. ఆపై కుటుంబంతో బెంగళూరులోని హెచ్ఎస్ఆర్ లేఅవుట్‌లో నివసిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఆయన భార్య పల్లవి ఇచ్చిన సమాచారంతో ఇంటికి వెళ్లిన పోలీసులు.. ఓం ప్రకాశ్ రక్తపు మడుగులో పడి ఉండటాన్ని గుర్తించారు. చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించినా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. హత్య అనంతరం మరో మాజీ డీజీపీకి 'ఐ హ్యావ్ ఫినిష్డ్ మాన్‌స్టర్' అంటూ ఫోనులో మెసేజ్ పెట్టినట్లు తెలుస్తోంది. ఆయన ఛాతీలో, మెడ వద్ద, కడుపులో, చేతిలో కత్తిపోట్లు ఉన్నట్లు వైద్యులు తెలిపారు. తీవ్ర రక్త స్రావం కారణంగానే ఆయన మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటన జరిగిన టైంలో కూతురు క్రుతి కూడా ఇంట్లోనే ఉంది. దీంతో ఆమె పాత్ర కూడా ఏమైనా ఉందా? అనే కోణంలో దర్యాప్తు జరుగుతోంది.

### ఈసీపై రాహుల్ గాంధీ

## సంచలన ఆరోపణలు



కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల వ్యవస్థ రాజీ పడినట్లు కనిపిస్తోందని, ఆ వ్యవస్థలోనే ఏదో తప్పు ఉందంటూ వ్యాఖ్యానించారాయన. ఈ క్రమంలో మహారాష్ట్ర ఎన్నికల ప్రస్తావననూ ఆయన తీసుకొచ్చారు. అమెరికా పర్యటనలో ఉన్న రాహుల్ గాంధీ(Rahul Gandhi).. ఆదివారం బోస్టన్‌లో ప్రవాస భారతీయులు పాల్గొన్న ఓ కార్యక్రమంలో ప్రసంగించారు. ''ఇటీవల మహారాష్ట్ర ఎన్నికల్లో (Maharashtra Election Fraud) 5.30 గంటల నుంచి 7.30 గంటల మధ్య 65 లక్షల మంది ఓటు వేసినట్లు ఎన్నికల సంఘం చెప్పింది. ఒక్కో ఓటర్ ఓటు వేయడానికి 3 నిమిషాల సమయం పడుతుంది. అలాంటప్పుడు అంత తక్కువ వ్యవధిలో అంతమంది ఎలా ఓటు వేయగలరు?. అక్కడ ఏదో తప్పు జరిగిందని స్పష్టంగా తెలుస్తోంది'' అని రాహుల్ అన్నారు.

''ఎన్నికల సంఘం రాజీ పడినట్లు ఇక్కడే అర్థమవుతోంది. ఆ వ్యవస్థలోనే ఏదో తప్పిదం ఉంది. ఇదే విషయాన్ని నేను చాలాసార్లు ప్రస్తావించాను. మహా ఎన్నికలకు సంబంధించిన వీడియోలు చూపించాలని మేం అడిగాం. అందుకు ఈసీ తిరస్కరించింది. ఇప్పుడు అలా అడగడానికి వీలు లేదంటూ చట్టాన్ని కూడా మార్చేశారు'' అని ఆయన వ్యాఖ్యానించారు. ఇదే వేదికగా ఆయన అమెరికా భారత్ మధ్య సంబంధాల గురించి కూడా మాట్లాడారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న రాహుల్.. సోమవారం బ్రౌన్ యూనివర్సిటీలో ప్రసంగించనున్నారు. ఇదిలా ఉంటే.. రాహుల్ గాంధీ ఈసీపై ఈ తరహా ఆరోపణలు చేయడం ఇదే తొలిసారి కాదు. అయితే.. రాహుల్ సహా పలువురు ప్రతిపక్ష నేతలు చేస్తున్న ఆరోపణలను ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు ఖండిస్తూ వస్తోంది. మరీ ముఖ్యంగా ఈవీఎంలను మేనేజ్ చేయొచ్చనే ఆరోపణలను కూడా తోసిపుచ్చుతూ వస్తోంది. అయినప్పటికీ వరుసగా ఆయా రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు, ఓటర్ల జాబితాల ఆధారంగా ప్రతిపక్షాలు ఈసీపై విమర్శలు గుప్పిస్తూనే ఉన్నాయి.

## ఉద్ధవ్‌తో రాజ్ ఠాక్రే పొత్తు..

**ముంబై:**

మహారాష్ట్రలో విపక్ష శివసేన(ఉద్ధవ్), మహారాష్ట్ర నవ నిర్మాణ సేన(ఎంఎన్ఎస్) చేతులు కలుపబోతున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. ఆ రెండు పార్టీల అధినేతలు ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రే వరుసకు సోదరులే. రెండు పార్టీల మధ్య త్వరలో పొత్తు కుదరబోతున్నట్లు రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. అయితే, రెండు పార్టీలతో కూటమి ఏర్పాటు అనే ప్రతిపాదన ప్రస్తుతానికి లేదని శివసేన(ఉద్ధవ్) సీనియర్ నేత, ఎంపీ సంజయ్ రౌత్ ఆదివారం తెలిపారు. రెండు పార్టీల నడుమ భావోద్వేగపూరిత చర్చలు నడుస్తున్నాయని వెల్లడించారు. కుటుంబ కార్యక్రమాలు, వేడుకల్లో ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రే కలుసుకోవడం, మాట్లాడుకోవడం సాధారణమేనని చెప్పారు. ఉమ్మడి శివసేన పార్టీలో పని చేసినప్పుడు ఉద్ధవ్ ఠాక్రేతో ఎలాంటి విభేదాలు తలెత్తలేదని తాజాగా ఓ ఇంటర్వ్యూలో రాజ్ ఠాక్రే చెప్పడం సంచలనాత్మకంగా మారింది.







## మరాఠీ బ్యూటీతో లవ్‌లో పడిపోయిన రామ్.. !

టాలీవుడ్ హీరో రామ్ పోతినేని (36) పెళ్లి గురించి ఇప్పటికే పలుమార్లు వార్తలు వచ్చాయి. తెలుగు పరిశ్రమలో మోస్ట్ ఎలిజబుల్ బ్యాచిలర్‌గా ఉండటం వల్లే ఆయనపై ఇలాంటి వార్తలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇలాంటి సమయంలో తనతో స్క్రీన్ షేర్ చేసుకున్న ఓ హీరోయిన్‌తో రామ్ ప్రేమలో పడిపోయాడని సోషల్‌మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతుంది. అందుకు సంబంధించిన ఫోటోలను కూడా వారు షేర్ చేస్తున్నారు. సినిమా షూటింగ్ సమయంలో వారిద్దరూ బాగా దగ్గరయిపోయారని నెటిజన్లు చెప్పుకొస్తున్నారు. మహారాష్ట్రకు చెందిన భాగ్యశ్రీ బోర్సే తో రామ్ పోతినేని ప్రేమలో పడిపోయాడని తెలుస్తోంది. సుమారు రెండు నెలల క్రితం కూడా వారు ప్రేమలో ఉన్నారనే ప్రచారం ఇండస్ట్రీలో వైరల్ అయింది. త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారని కూడా టాక్ వచ్చింది. తాజాగా ఓ హోటల్ గది నుంచి రామ్, భాగ్యశ్రీ వేర్వేరుగా ఫొటోలను అభిమానులతో పంచుకున్నారు. అయితే, అవి ఒకే గది నుంచి తీసినవని కొందరు గుర్తించారు. ఒకేచోట ఇద్దరూ కలిసే ఉన్నారని నెటిజన్లు కామెంట్ల రూపంలో తెలుపుతున్నారు. ఇప్పటికే ఇదీ రూట్‌లో విజయ్ దేవరకొండ, రష్మిక ఎలాగూ ఉన్నారని, ఇప్పుడు మరో కొత్త జంట వచ్చేసిందని అంటున్నారు. అయితే, ఇందులో ఎంతమాత్రం నిజం ఉందో తెలియాల్సి ఉంది. వారిద్దరిలో ఎవరైనా రియాక్ట్ అయ్యే వరకు ఈ ప్రచారాన్ని ఆపడం కాస్త కష్టమే అని చెప్పవచ్చు. మిస్టర్ బచ్చన్ సినిమాతో టాలీవుడ్‌కు ఎంట్రీ ఇచ్చిన ఈ 25 ఏళ్ల బ్యూటీ ఇప్పుడు రామ్ పోతినేనితో ఒక సినిమా(RAPO22) చేస్తుంది. 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' విజయం తర్వాత మహేష్ బాబు. పి దర్శకత్వం వహిస్తున్న చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ ఫీల్ గుడ్ అండ్ క్రేజీ ఎంటర్‌టైనర్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. అయితే, ఈ సినిమా సమయంలోనే వారిద్దరి మధ్య మంచి స్నేహం ఏర్పడిందని సమాచారం. ఈ సినిమాతో పాటు విజయ్ దేవరకొండ కింగ్‌డమ్ చిత్రంలోనూ భాగ్యశ్రీ నటిస్తుంది.

## ఛావా మరో క్రేజీ రికార్డ్.. పుష్ప-2 సరసన చేరిన బాలీవుడ్ మూవీ!



విక్కీ కౌశల్,రష్మిక మందన్నా ప్రధాన పాత్రల్లో నటించిన సూపర్ హిట్ సినిమా ఛావా(Chhaava Movie). ఈ ఏడాది ఫిబ్రవరి 14న హిందీలో రిలీజై బాక్సాఫీస్ వద్ద సుమారు రూ. 800 కోట్లకు పైగానే కలెక్షన్స్ రాబట్టింది. ఛావా సినిమాకు బాలీవుడ్‌లో హిట్ టాక్ రావడంతో.. మార్చి 7న ఈ చిత్రాన్ని తెలుగులో గీతా ఆర్ట్స్ విడుదల చేసింది. టాలీవుడ్‌లోనూ అదిరిపోయే వసూళ్లు రాబట్టింది. ప్రస్తుతం ఈ చిత్రం ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. ఛత్రపతి శివాజీ కుమారుడు శంభాజీ మహారాజ్ జీవిత చరిత్ర ఆధారంగా తీసిన 'ఛావా' దేశవ్యాప్తంగా టాక్ ఆఫ్ ద ఇండస్ట్రీగా నిలిచింది. తాజాగా ఈ చిత్రం మరో ఘనతను సాధించింది. కేవలం హిందీలో దేశవ్యాప్తంగా రూ.600 కోట్లకు పైగా నెట్ వసూళ్లు సాధించిన చిత్రాల సరసన నిలిచింది. పుష్ప 2, స్త్రీ2 తర్వాత ఈ అరుదైన ఘనత సాధించిన మూడో చిత్రంగా ఛావా చోటు దక్కించుకుంది. స్త్రీ2 తర్వాత ఈ రికార్డ్ కొల్లగొట్టిన రెండో బాలీవుడ్ మూవీగా అవతరించింది. ఈ విషయాన్ని విక్కీ కౌశల్ తండ్రి, బాలీవుడ్‌లో దర్శకుడైన శామ్ కౌశల్ సోషల్ మీడియాలో పంచుకున్నారు. 600 నాట్ అవుట్ అంటూ పోస్టర్‌ను షేర్ చేశారు. ప్రముఖ ట్రేడ్ అనలిస్ట్ తరణ్ ఆదర్శ్ ఈ గణాంకాలను వెల్లడించారు. ఈ చిత్రాన్ని బ్లాక్‌బస్టర్‌గా మార్చడంలో మద్దతు ఇచ్చిన అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. కాగా.. ఈ సినిమాకు లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ సంగీతమందించారు. ఈ చిత్రంలో అక్షయ్ ఖన్నా, అశుతోష్ రానా, దివ్య దత్తా కూడా కీలక పాత్రల్లో నటించారు. మడాక్ ఫిల్మ్స్ పతాకంపై దినేష్ విజన్ ఈ చిత్రాన్ని నిర్మించారు.

**హిందీలో టాప్- 10 నెట్ వసూళ్లు సాధించిన చిత్రాలు..**

1) పుష్ప: ది రూల్ పార్ట్ 2 రూ.812.14 కోట్లు 2) స్త్రీ 2 రూ.597.99 కోట్లు
3) ఛావా రూ.585.43 కోట్లు 4) జవాన్ రూ.582.31 కోట్లు
5) గదర్ 2 రూ.525.7 కోట్లు 6) పఠాన్ రూ.524.53 కోట్లు
7) బాహుబలి 2 ది కన్‌క్లూజన్ రూ.510.99 కోట్లు 8) యానిమల్ రూ.502.98 కోట్లు
9) కేజీఎఫ్ చాప్టర్ 2 రూ.435.33 కోట్లు 10) దంగల్ రూ.374.43 కోట్లు

## క్రీడా వార్తలు SPORTS NEWS

## చితక్కొట్టిన శుబ్‌మన్.. కేకేఆర్‌పై గుజరాత్ గ్రాండ్ విక్టరీ



ఐపీఎల్ 2025లో గుజరాత్ టైటాన్స్ తమ జైత్రయాత్రను కొనసాగిస్తోంది. ఈ మెగా ఈవెంట్‌లో భాగంగా ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 39 పరుగుల తేడాతో ఘన విజయాన్ని గుజరాత్ అందుకుంది. 199 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన కోల్‌కతా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 159 పరుగులు మాత్రమే చేయగల్గింది. కేకేఆర్ బ్యాటర్లలో కెప్టెన్ అజింక్య రహానే(50)టాప్ స్కోరర్‌గా నిలవగా.. ఆఖరిలో రఘువన్షి(27) పర్వాలేదన్పించాడు. మిగితా ప్లేయర్లంతా దారుణంగా విఫలమయ్యారు. గుజరాత్ బౌలర్లలో రషీద్ ఖాన్, ప్రసిద్ధ్ కృష్ణ తలా రెండు వికెట్లు పడగొట్టగా.. సిరాజ్, సుందర్, ఇషాంత్ శర్మ సాయికిషోర్ చెరో వికెట్ పడగొట్టారు.

**చితక్కొట్టిన శుబ్‌మన్..**

ఇక ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 198 పరుగులు చేసింది. గుజరాత్ బ్యాటర్లలో కెప్టెన్ శుబ్‌మన్ గిల్ విధ్వంసం సృష్టించాడు. తన సూపర్ బ్యాటింగ్‌తో ఈడెన్‌లో బౌండరీలు వర్షం కురిపించాడు. 55 బంతులు ఎదుర్కొన్న గిల్.. 10 ఫోర్లు, మూడు సిక్సులతో 90 పరుగులు చేశాడు. గిల్‌తో పాటు సాయిసుదర్శన్(52), బట్లర్(41) మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడారు. కేకేఆర్ బౌలర్లలో వైభవ్ ఆరోరా, హర్షిత్ రాణా, రస్సెల్ తలా వికెట్ సాధించారు. ఇప్పటివరకు 8 మ్యాచ్‌లు ఆడిన గుజరాత్ 6 విజయాలతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

## సీఎస్‌కే స్టార్ ఓపెనర్ ఇంట తీవ్ర విషాదం



న్యూజిలాండ్ వికెట్ కీపర్ బ్యాటర్, చెన్నై సూపర్ కింగ్స్ స్టార్ ఓపెనర్ డెవాన్ కాన్వే ఇంట తీవ్ర విషాదం నెలకొంది. అతడి తండ్రి డెంటాన్ కన్నుమూశారు. ఈ విషయాన్ని సీఎస్‌కే అధికారికంగా ధ్రువీకరించింది. "ఈ క్లిష్ట సమయంలో కాన్వే కుటుంబానికి మద్దతుగా ఉంటాము. డెంటాన్ మృతికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాము" అని సీఎస్‌కే యాజమాన్యం ఎక్స్‌లో రాసుకొచ్చింది. కాగా కాన్వే తండ్రి మృతికి సంతాపంగా ఆదివారం ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సీఎస్‌కే ఆటగాళ్లు నల్లటి బ్యాండ్‌లు ధరించి మైదానంలో దిగారు. కాగా కాన్వే ఇప్పటికే న్యూజిలాండ్‌కు చేరుకున్నాడు. అతడు ఈ ఏడాది ఐపీఎల్‌లో చివరగా ఏప్రిల్ 11న సీఎస్‌కే తరపున ఆడాడు. దక్షిణాఫ్రికాకు చెందిన డెంటాన్ కాన్వే కుటుంబం.. డెవాన్ కాన్వే చిన్నతనంలో న్యూజిలాండ్‌కు మకాం మార్చారు. ఈ క్రమంలోనే కాన్వే దేశవాళీ టోర్నీల్లో అద్భుతంగా ప్రదర్శన చేసి కివీస్ తరపున అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. అతి తక్కువ కాలంలోనే బ్లాక్‌క్యాప్స్ జట్టులో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. ఐపీఎల్ 2025లో ఇప్పటివరకు మూడు మ్యాచ్‌లు ఆడిన డెవాన్.. 27.03 స్ట్రైక్ రేట్‌తో 94 పరుగులు చేశాడు. కాన్వే తిరిగి రావడంపై మాత్రం సీఎస్‌కే ఎటువంటి ప్రకటన చేయలేదు. ఇక ఈ ఏడాది సీజన్‌లో సీఎస్‌కే దారుణ ప్రదర్శన కనబరుస్తోంది. చెన్నై జట్టు ఇప్పటివరకు 8 మ్యాచ్‌లు ఆడి కేవలం రెండింట మాత్రమే విజయం సాధించి పాయింట్ల పట్టికలో ఆఖరి స్థానంలో కొనసాగుతోంది.

## ఏంటి గిల్.. పెళ్లి ఎప్పుడు చేసుకుంటావు?



ఐపీఎల్ 2025లో ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్, గుజరాత్ టైటాన్స్ జట్లు తలపడతున్నాయి. అయితే ఈ మ్యాచ్ టాస్ సందర్భంగా ఓ ఆసక్తికర సన్నివేశం చోటు చేసుకుంది. టాస్ సమయంలో న్యూజిలాండ్ మాజీ క్రికెటర్, ప్రముఖ క్రికెట్ వ్యాఖ్యాత డానీ మోరిసన్ నవ్వులు పూయించాడు. ఏ సాధారణంగా వ్యాఖ్యాత అయినా టాస్ సందర్భంగా కెప్టెన్‌లను జట్టు మార్పులు, మ్యాచ్ ప్లాన్స్ గురుంచి అడుగుతారు. కానీ మోరిసన్ మాత్రం గుజరాత్ కెప్టెన్ శుబ్‌మన్ గిల్‌ను తన వివాహ ప్రణాళికల గురించి అడిగాడు. ఈ కివీస్ మాజీ క్రికెటర్ గిల్‌ను త్వరలో పెళ్లి చేసుకుంటున్నారా? అని ప్రశ్నించాడు. ఆ ప్రశ్నతో ఆశ్చర్యపోయిన గిల్.. అటువంటి ప్లాన్స్ ఏమీ లేవంటూ నవ్వుతూ సమధానమిచ్చాడు. వీరిద్దరి సంభాషణకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతోంది. ఇక ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన కేకేఆర్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. కోల్‌కతా రెండు మార్పులతో బరిలోకి దిగింది. వరుస మ్యాచ్‌ల్లో విఫలమవతున్న స్టార్ ఓపెనర్ క్వింటన్ డికాక్‌ను కేకేఆర్ మెనెజ్‌మెంట్ పక్కన పెట్టింది. అతడి స్థానంలో అఫ్గాన్ స్టార్ ప్లేయర్ గుర్బాజ్ తుది జట్టులోకి వచ్చాడు.

**తుది జట్లు**

గుజరాత్ టైటాన్స్ (ప్లేయింగ్ XI): సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), జోస్ బట్లర్ (వికెట్ కీపర్), షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్, రాహుల్ తెవాటియా, వాషింగ్టన్ సుందర్, షారుక్ ఖాన్, రషీద్ ఖాన్, రవిశ్రీనివాసన్ సాయి కిషోర్, ప్రసిద్ధ్ కృష్ణ, మహ్మద్ సిరాజ్

కోల్‌కతా నైట్ రైడర్స్ (ప్లేయింగ్ XI): రహ్మానుల్లా గుర్బాజ్ (వికెట్ కీపర్), సునీల్ నరైన్, అజింక్యా రహానే(కెప్టెన్), వెంకటేష్ అయ్యర్, రింకూ సింగ్, మొయిన్ అలీ, ఆండ్రీ రస్సెల్, రమణదీప్ సింగ్, హర్షిత్ రాణా, వైభవ్ అరోరా, వరుణ్ చక్రవర్తి

## రాజస్తాన్ రాయల్స్‌కు భారీ షాక్.. ఇక కష్టమే మరి?



ఐపీఎల్ 2025లో వరుస ఓటుములతో సతమతమవుతున్న రాజస్తాన్ రాయల్స్ ఇప్పుడు మరో కీలక పోరుకు సిద్ధమైంది. ఈ మెగా టోర్నీలో భాగంగా ఏప్రిల్ 24న చిన్నస్వామి స్టేడియం వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో రాజస్తాన్ తాడోపేడో తెల్చుకోనుంది. ప్లే ఆఫ్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలంటే రాజస్తాన్‌కు ఈ మ్యాచ్ చాలా కీలకం. అయితే ఈ మ్యాచ్‌కు రాయల్స్‌కు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఆర్సీబీతో మ్యాచ్‌కు కెప్టెన్ సంజూ శాంసన్ గాయం దూరమయ్యాడు. సంజూ ప్రస్తుతం పక్కటెముకల నొప్పితో బాధపడుతున్నాడు. అతడు గాయం నుంచి కోలుకోవడానికి మరో వారం రోజుల సమయం పట్టనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆర్సీబీతో మ్యాచ్‌కు శాంసన్ దూరమయ్యాడు. ఈ విషయాన్ని రాయల్స్ ఫ్రాంఛైజీ ధ్రువీకరించింది. శాంసన్ కోలుకుంటున్నాడని, జట్టుతో పాటు బెంగళూరుకు వెళ్లకుండా జైపూర్‌లోనే ఉండిపోయినట్లు రాజస్తాన్ మెనెజ్‌మెంట్ ఓ ప్రకటనలో పేర్కొంది. దీంతో అతడి స్థానంలో రియాన్ పరాగ్ కెప్టెన్‌గా కొనసాగనున్నాడు. కాగా ఈ ఏడాది సీజన్‌లో రాజస్తాన్ రాయల్స్ వరుసగా రెండు మ్యాచ్‌ల్లో అనూహ్య ఓటములను చవిచూసింది. ఢిల్లీ క్యాపిటల్స్‌పై సూపర్ ఓవర్‌లో పరాజయం పాలైన రాజస్తాన్.. ఆఖరి మ్యాచ్‌లో లక్నోపై 2 పరుగుల తేడాతో ఓడిపోయింది. రాజస్తాన్ ఇప్పటివరకు 8 మ్యాచ్‌లు ఆడి కేవలం రెండు విజయాలతో పాయింట్ల పట్టికలో ఎనిమిదివ స్థానంలో ఉంది.

## చరిత్ర సృష్టించిన ముంబై ఇండియన్స్.. తొలి జట్టుగా



ఐపీఎల్ 2025లో ముంబై ఇండియన్స్ మరో అద్భుత విజయాన్ని అందుకుంది. ఈ మెగా ఈవెంట్‌లో భాగంగా ఆదివారం వాంఖడే వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 9 వికెట్ల తేడాతో ముంబై గెలుపొందింది. సీఎస్‌కే నిర్ధేశించిన 177 పరుగుల లక్ష్యాన్ని ముంబై ఇండియన్స్ కేవలం ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి చేధించింది. ముంబై స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ(76), సూర్యకుమార్ యాదవ్(68) అజేయంగా నిలిచి మ్యాచ్‌ను ముగించారు. అంతకు ముందు బ్యాటింగ్ చేసిన చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. సీఎస్‌కే బ్యాటర్లలో రవీంద్ర జడేజా(53), శివమ్ దూబే(50) హాఫ్ సెంచరీలతో రాణించారు. ముంబై బౌలర్లలో జస్ప్రీత్ బుమ్రా రెండు వికెట్లు పడగొట్టగా.. చాహర్, శాంటర్న్ తలా వికెట్ సాధించారు.

**చరిత్ర సృష్టించిన ముంబై..**

ఇక ఈ మ్యాచ్‌లో సీఎస్‌కేను చిత్తు చేసిన ముంబై ఇండియన్స్ ఓ అరుదైన రికార్డును తమ పేరిట లిఖించుకుంది. ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌ను మూడు సార్లు తొమ్మిది లేదా అంతకంటే ఎక్కువ వికెట్ల తేడాతో ఓడించిన తొలి జట్టుగా ముంబై ఇండియన్స్ చరిత్ర సృష్టించింది. ముంబై కంటే ముందు ఏ జట్టు కూడా ఈ ఫీట్ సాధించలేకపోయింది. 2008 ఐపీఎల్ సీజన్‌లో సీఎస్‌కేను తొలిసారిగా ముంబై ఇండియన్స్ తొమ్మిది వికెట్ల తేడాతో ఓడించింది. ఆ తర్వాత 2020 సీజన్‌లో షార్జా వేదికగా జరిగిన మ్యాచ్‌లో చెన్నైపై 10 వికెట్ల తేడాతో ముంబై ఘన విజయం సాధించింది. మళ్లీ ఇప్పుడు ఐదేళ్ల తర్వాత చెన్నైను 9 వికెట్ల తేడాతో హార్దిక్ సేన ఓడించింది. కాగా ఈ ఓటమితో సీఎస్‌కే తమ ప్లేఆఫ్ ఆశలను సంక్లిష్టం చేసుకుంది. ఇప్పటివరకు 8 మ్యాచ్‌ల ఆడిన చెన్నై కేవలం రెండింట మాత్రమే విజయం సాధించి పాయింట్ల పట్టికలో ఆఖరి స్థానంలో కొనసాగుతోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com

